



# విజయభాను






విశాఖపట్నం, శుక్రవారం 20-10-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 36 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## గతంలో జరగని అభివృద్ధి
# ఇప్పుడు జరుగుతోంది

- జగనన్న చేదోడు పథకం కింద 3,25,020 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.325.02 కోట్లు జమ
- 52 నెలల పాలనలో ఆ మాట నిలబెట్టుకున్నాం : సీఎం జగన్




కర్నూల్, (విజయభాను న్యూస్) : వెనుకబడిన కులాలను, వెనుకబడిన వర్గాలను.. వెన్నెముక మాదిరిగా దృఢంగా మారుస్తామూ అని ఏదైతే మాట ఇచ్చామో పాదయాత్ర సందర్భంగా.. ఈ రోజు నేను మీ బిడ్డగా మీ అన్నగా.. మీ తమ్ముడిగా.. సగర్వంగా తలెత్తుకుని చెబుతా ఉన్నాను. ఈ 52 నెలల పరిపాలనలో నవరత్నాల్లోని ప్రతీ ఒక్క కార్యక్రమం ద్వారా నా ఎస్సీలను, నా ఎస్టీలను, నా బీసీలను, నా మైనారిటీలను, నా నిరుపేద వర్గాలను చేయి పట్టుకుని నడిపించగలిగాను. వారి జీవిత ప్రయాణంలో తోడుగా ఉండగలిగామని సగర్వంగా, మీ బిడ్డగా చెప్పుకోవడానికి గర్వపడతా ఉన్నాను.. జగనన్న చేదోడు నిధుల జమ కార్యక్రమం కోసం గురువారం కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన సభకు సీఎం జగన్ హాజరై ప్రసంగించారు. "వరుసగా నాలుగో ఏడాది జగనన్న చేదోడు అందజేస్తున్నాం.. ఎక్కడా అవినీతి, వివక్ష లేకుండా నేరుగా ఖాతాల్లోకి నిధులు జమ చేస్తున్నాం. ఈరోజు సొంత షాపులు ఉన్న రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం. జగనన్న చేదోడు అనే కార్యక్రమం బటన్ నొక్కి నేరుగా అన్నదమ్ములు, అక్క చెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి పంపడం జరుగుతుంది.

వరుసగా నాలుగో ఏడాది అమలు చేస్తూ 3.25 లక్షల మందికి రూ.325 కోట్లు నేరుగా పంపించడం జరుగుతుంది. ఒక్క చేదోడు పథకం ద్వారా మాత్రమే రూ.1250 కోట్లు ఇవ్వడం జరిగింది. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో చేదోడు పథకం ద్వారా మాత్రమే లక్షల మందికి రూ.40 వేల దాకా వాళ్ల కుటుంబాలకు ఇవ్వగలిగాం. గతానికి ఇప్పటికి పోలికలు చూడమని

తరువాయి 2లో..




## పాలస్తీనియన్ అథారిటీ అధ్యక్షుడితో మాట్లాడిన ప్రధాని మోదీ



దిల్లీ: భారత ప్రధాని నరేంద్రమోదీ పాలస్తీనియన్ అథారిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా గాజా ఆస్పత్రిపై జరిగిన బాంబు దాడిలో పౌరుల ప్రాణాలు కోల్పోయిన ఘటన పట్ల సంతాపాన్ని తెలియజేశారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో పాలస్తీనా ప్రజలకు భారత్ మానవతా సాయాన్ని పంపిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. 'ఆ ప్రాంతంలో ఉగ్రవాదం, హింస, క్షీణిస్తున్న భద్రతా పరిస్థితిపై మా తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశాం. ఇజ్రాయెల్-పాలస్తీనా సమస్యపై భారతదేశం అనుసరిస్తున్న దీర్ఘకాల వైఖరిని పునరుద్ఘాటించాం' అని మోదీ ట్వీట్‌లో (ఎక్స్) పేర్కొన్నారు.

ఈ నెల 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేశారు. దాంతో ఇజ్రాయెల్ హమాస్‌ను భూస్థాపితం చేసేందుకు గాజాపై దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో గాజాలోని ఓ ఆస్పత్రిపై వైమానిక దాడి జరిగింది. ఆ పేలుడులో వందల మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ చర్యను పలు దేశాధినేతలు ఖండించారు. "గాజాలోని అల్ అహ్లి ఆసుపత్రిలో పెను ప్రాణనష్టం సంభవించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. ప్రస్తుత ఘర్షణల్లో (ఇజ్రాయెల్-హమాస్ పోరును ఉద్దేశిస్తూ) పౌరులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత తీవ్రమైన, ఆందోళనకర అంశం. ఇందుకు కారకులకు శిక్ష పడాలి" అని మోదీ అన్నారు. అయితే, ఈ దాడికి ఇజ్రాయెల్ కారణమని హమాస్ ఆరోపించగా.. హమాస్ వదిలిన రాకెట్ వైఫల్యం చెందడంతోనే ప్రమాదం జరిగిందని ఇజ్రాయెల్ సమాధానమిచ్చింది.

## జనసంద్రంగా తిరుమల.. గరుడ సేవకు తరలివచ్చిన లక్షలాదిమంది భక్తులు



తిరుమల: ఏడు కొండలు భక్తజన సంద్రంగా మారాయి. గరుడ సేవను వీక్షించేందుకు లక్షలాది మంది తిరుమలకు పోటెత్తారు. భక్తుల గోవిందనామస్మరణ మధ్య గురువారం సాయంత్రం శ్రీవారి గరుడసేవ ప్రారంభమైంది. తిరుమలలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు తనకెంతో ప్రీతిపాత్రమైన గరుడవాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తకోటికి

తరువాయి 2లో..

## చంద్రబాబు జ్యుడిషియల్ రిమాండ్ నవంబర్ 1 వరకు పొడిగింపు

### బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులోనూ విచారణ



అమరావతి: (విజయభాను న్యూస్) : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు బ్యాడ్ న్యూస్‌లు వచ్చాయి. స్కిల్ డెవలెప్‌మెంట్ కేసులో.. విజయవాడ ఏసీబీ కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌ను నవంబర్ 1 వరకు పొడిగించింది. అయితే చంద్రబాబు తన సెక్యూరిటీ, ఆరోగ్య పరమైన అంశాలను జడ్జి దగ్గర ప్రత్యేకంగా ప్రస్తావించారు. అలాగే భద్రతాపరమైన అంశాలపై అనుమానాలు ఉన్నాయన్నారు. దీంతో కోర్టు ఏమైనా అనుమానాలు ఉంటే రాత పూర్వకంగా ఇవ్వాలని న్యాయమూర్తి చంద్రబాబుకు సూచించారు. మరోవైపు స్కిల్ డెవలెప్‌మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. చంద్రబాబు తరఫున సుప్రీం కోర్టు సీనియర్ లాయర్ సిద్ధార్థ్ లూథ్రా, సీఐడీ తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. చంద్రబాబుకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించిందని పొన్నవోలు కోర్టుకు చెప్పారు. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్‌పై కూడా తీర్పు రిజర్వులో ఉందని.. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం పెండింగ్‌లో ఉన్నప్పుడు హైకోర్టులో విచారణ చేయవద్దని కోరారు. చంద్రబాబు ఆరోగ్యం బాగాలేదని.. ఆయనకు బెయిల్ ఇవ్వమని హరీష్‌సాల్వే సుప్రీంకోర్టులో వాదించినట్లు పొన్నవోలు తెలిపారు. దీనిపై మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది నిజమేనా అని లూథ్రాని హైకోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టులో చంద్రబాబు ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి రిపోర్టులు అందజేయలేదన్నారు లూథ్రా.

తరువాయి 2లో..

## భారీ సంఖ్యలో డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసిన జగన్ సర్కారు

అమరావతి : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. 60 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు కొద్దిసేపటి క్రితం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు నోటీసులు

ఢిల్లీ : న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ మరియు హెచ్.ఆర్ అధినేత అమీర్ చక్రవర్తిలను క్రూరమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) కింద అరెస్టు చేసి రిమాండ్ చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బి.ఆర్. గవాయ్ మరియు ప్రశాంత్ కుమార్ మిశ్రా గురువారం ఢిల్లీ పోలీసులకు నోటిసులు జారీ చేశారు. ఈ కేసు అక్టోబర్ 30న విచారణకు రానుంది. మొదట, కోర్టు మూడు వారాల తర్వాత విచారణ తేదీని ఇచ్చింది, కానీ సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ దసరా సెలవుల తర్వాత వెంటనే కేసును జాబితా

తరువాయి 2లో..

## ఏపీలో ఈ చలానా కుంభకోణం..
### రూ.36.52 కోట్లు దుర్వినియోగం

అమరావతి: ఏపీలో భారీ స్కామ్ వెలుగు చూసింది. పోలీసు శాఖలో జరిగిన ఈ-చలానా కుంభకోణంలో మొత్తం రూ.36.52 కోట్లు దుర్వినియోగమైనట్టు గుర్తించామని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు తెలిపారు. కొమ్మిరెడ్డి అవినాష్‌కు చెందిన రేజర్ పీఈ ఖాతాకు డబ్బంతా మళ్లించారని, దీంతో పీఈ ఖాతా నుంచి నగదు డీజీ ఖాతాకు జమకాలేదన్నారు. ఈ విషయాన్ని సెప్టెంబరులో తిరుపతి యూనిట్‌లో గుర్తించామని తెలిపారు. "డేటా సొల్యూషన్స్ నిర్వాహకుడు అవినాష్‌ను సంజాయిషీ అడిగాం. నిధుల దుర్వినియోగంపై వివరణ కోరాం. డేటా సొల్యూషన్స్ ప్రతినిధి రాజశేఖర్‌ను ప్రశ్నించాం.

సరైన సమాచారం ఇవ్వకుండా అవినాష్ కాలయాపన చేశాడు. రాజశేఖర్‌ను అరెస్టు చేసి విచారణ జరిపాం. విచారణలో నిధులు దుర్వినియోగం చేసినట్టు నిందితుడు అంగీకరించాడు. అవినాష్ ఆస్తుల విషయమై సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశాం. ఆస్తుల క్రయవిక్రయాలకు తావులేకుండా చూడాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరాం. త్వరలోనే నిందితుడు అవినాష్‌ను పట్టుకుంటాం. కొమ్మిరెడ్డి అవినాష్ మాజీ డీజీపీకి బంధువు" అని ఐజీ పాలరాజు మీడియాకు వెల్లడించారు.






# విద్య వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

### సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు




పార్వతీపురం, విజయ భాను న్యూస్ అక్టోబర్ 19 : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలోకి దూసుకు వెళ్తుందని సి.రాఘవచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయని గుర్తుచేశారు.సి.ఆర్.ఏ.పి మీడియా అకాడమీ మరియు ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అభివృద్ధిపథంలో ఆంధ్రప్రదేశ్ - పాలన సంస్కరణలు - మెరుగైన పౌర సేవలపై సదస్సు గురువారం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొని, శాసనసభ్యులు అలజంగి జోగారావు తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంగా ఉన్న పార్వతీపురంని పరిపాలన వికేంద్రికరణలో భాగంగా జిల్లాగా చేశారని తెలిపారు. ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకెళ్లే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, ప్రతి 50 గృహాలకు వాలంటీర్లును ఏర్పాటుచేసి ప్రజల ముంగిటికే ప్రభుత్వాన్ని తీసుకువచ్చి సుపరిపాలన చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి దేనని కొనియాడారు. గత 40 ఏళ్లలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేతమైన, విప్లవాత్మకమైన నిర్ణయాలను తీసుకుని అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ,రాజకీయాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతను ఈ ముఖ్యమంత్రి ఇస్తున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో 10 మంది వైద్యులు, 105 రకాల మందులను ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.ఇంటి వద్దకే వైద్యుడ్ని పంపి అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాడు - నేడు పేరుతో

తరువాయి 2లో..

# సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ

## సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు





పరవాడ:-పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ లో(గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు సారధ్యంలో మలేరియా విభాగంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ముఖ్య అతిధిగా పాల్గొన్ని అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ డెంగ్యూ ,మలేరియా చికెన్ గునియా తదితర వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను సూచనలను ప్రజలకు క్లుప్తంగా వివరించారు, ఎవరికైనా జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు, పిహెచ్ సి డాక్టర్ కనక అప్పారావు మాట్లాడుతూ పజలందరూ ఎప్పటికప్పుడు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు . అనవసరంగా నీళ్లను నిల్వ లేకుండా చూసుకోవాలి చెప్పారు . ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫ్రైడే డ్రై డే ను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎజ్యుక్యూట్ పార్వతీ హెల్త్ సూపర్వైజర్లు వి సత్యనారాయణ ,ధనలక్ష్మి ఎఎన్ఎం దుర్గ , ఎంఎల్ హెచ్ సి వెంకటరత్నం ఆశావర్కలు , సచివాలయం సిబ్బంది , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల చెంతకే కార్పొరేట్ వైద్యం - అవంతి



విశాఖ రురల్ బి మధురవాడ (విజయభాను న్యూస్) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే సేవలందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ కోరారు. అందులో భాగంగా జీవీఎంసీ జోన్ 2 పరిధి 6వ వార్డు రిక్షా కాలనిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ లక్ష్మి ప్రియాంక మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైద్యరంగంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం అయినందుకు చాలా ఆనందంగా ఉందని, 6వ వార్డు లో మొత్తం 14 సచివాలయల్లో కూడా సురక్ష కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపక్షాలకు కావాల్సింది రాజకీయమనీ, కానీ జగన్ మోహన్ రెడ్డికి కావాల్సింది ప్రజల సంక్షేమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వైద్యులకు సన్మానించి, అనంతరం వృద్ధులకు కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, 6,7 వార్డుల అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, అల్లాడ లింగేశ్వర రావు, గుంటుబోయిన సంజీవ్, వార్డు మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# పలు సమస్యలపై వినతి పత్రం అందజేత




విశాఖ రురల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : జీవీఎంసీ ఐదో వార్డ్ సమస్యలపై గురువారం కార్పొరేటర్ మొల్లి హేమలత కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ సాయి కాంత్ వర్మకు వినతిపత్రం అందజేశారు. మధురవాడ పై వంతెన దగ్గర వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, దశాబ్దాలుగా ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులు పనులు చేపట్టిన మళ్లీ ఆ సమస్య పునరావతం అవుతుందని, మధురవాడ ప్రజలు జీవీఎంసీ జోనల్ ఆఫీసుకు, ప్రైమరీ హెల్త్ సెంటర్ కు, ఎలక్ట్రికల్ ఆఫీసుకు, జడ్పీహెచ్ స్కూలుకు, పోలీస్ స్టేషన్ కు, మధురవాడ మార్కెట్ మరియు రైతు బజార్ కు వెళ్లాలంటే ఈ మార్గంలోనే ఇబ్బంది పడుతూ వెళ్లడం జరుగుతుందని, కావున ఇప్పటికైనా కొమ్మాది జంక్షన్ నుండి చంద్రంపాలెం వరకు సర్వీస్ రోడ్డు పై గల వర్షపు నీటినిల్వ సమస్య శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

వార్డులో పలు కాలనీలలో త్రాగునీరు, యూజీడి సమస్య కు శాశ్వత పరిష్కారం చూపాలని వీధిలైట్ల సమస్య చాలా ఎక్కువగా ఉందని విస్తీర్ణం దృశ్య చాలా పెద్ద వార్డు అయినందువల్ల చాలా చోట్ల కొత్త వీధిలైట్లు లేకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని కావున వెంటనే క్రొత్త వీధిలైట్లు వీటన్నిటికీ నిధులు మంజూరు చేయాలని మేయర్ హరి వెంకట కుమారి, కమిషనర్ సాయి కాంత్ వర్మకు హేమలత కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

# న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు నోటీసులు

చేయాలని కోర్టును కోరారు. అతని క్లయింట్, పుర్కాయస్థకు 70 ఏళ్లు పైబడిన వారని, చాలా రోజులు నుండి రిమాండ్ లో ఉన్నారని తెలిపడంతో విచారణ తేదీని 30కి మార్చారు. ఆగస్టు 17న నమోదైన ఎఫ్ఐఆర్‌ను అనుసరించి అక్టోబర్ 3న ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం పుర్కాయస్థ మరియు చక్రవర్తిలను అరెస్టు చేసిన విషయం విదితమే.

# కౌన్సిల్ సమావేశంలో గళం విప్పిన కార్పొరేటర్ రౌతు



పరవాడ : కౌన్సిల్ సమావేశంలో 79వ వార్డ్ కార్పొరేటర్ వార్డు సమస్యలను విశాఖ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగినది. దీనిలో ముఖ్యమైన సమస్యలు లంకెల పాలెం జంక్షన్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్, ఎయిర్ క్వాలిటీ మిషన్ స్థానిక పొల్యూషన్ కంట్రోల్ చేయుటకు ఏర్పాటు చేయాలని, వార్డులో ఓపెన్ ప్లేస్లో ఓపెన్ జిమ్ము ఏర్పాటు చేయాలని, సానిటరీ సిబ్బంది కొరత తీర్చాలని, వాటిలో అభివృద్ధి పనులు చేయాలని కమిషనర్ గారికి వినతిపత్రం అందజేశారు.

# రైతులకు శిక్షణ కార్యక్రమం



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : భీమిలీ మండలం సింగనబంద గ్రామ పంచాయతీలో గురువారం పొలంబడి లో భాగంగా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారుఈ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండల వ్యవసాయధికారి బి.శివకోమలి మాట్లాడుతూ వరి పంటలో సమగ్ర యాజమాన్యం పద్ధతులు గురించి వివరిస్తు తక్కువ పెట్టుబడితో సాగు ఖర్చు ను తగ్గించటమే పొలంబడి యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని ,అలాగే పొలం పరిసరాల విశ్లేషణ చేసి , మిత్ర పురుగుల సంరక్షణ ,మరియు ప్రస్తుత వాతావరణంలో వరి తెగులు మరియు పురుగుల నుండి సంరక్షించేందుకు సరైన తెగులు మరియు పురుగు మందులు తగిన మోతాదులో వాడాలని సూచించారు .అలాగే క్షేత్ర పరిశీలన తరువాత వరి రకం ఎం టి యు-1121, అన్నపూర్ణ లో అధికం గా పాముపొడ తెగులు గుర్తించారు నివారణకు గాను హెక్సాకొనాజోల్ 400 ఎం ఎల్ మందును 1 ఏకరాకి పిచికారి చెయ్యాలని ,అలాగే అకుముడ త పురుగుకుగాను ఎసిఫేట్ 300 గ్రాములు మందును 1 ఏకరానికి పిచికారి చెయ్యాలి అని తెలిపారు .సాంబామసురి రకం లో అగ్గితెగులు గుర్తించారు నివారణ కొరకు ట్రైసైకిలోజోల్ 400 ఎం ఎల్ మందును ఏకరానికి పిచాకారి చేసుకోవాలని సూచించారు. తదనంతరం రైతులకు సమగ్ర పురుగు నివారణ కిట్ లు అందించారు.అలాగే వరిపోలాల్లో తూర్పు పడమర దిశగా కాలి బాటలు తీసుకోవాల్సిందిగా సూచించారు.కాలి బాటలు తీసుకోవడం వల్ల గాలి,వెలుతురు పంటకి బాగా తగిలి తెగులు మరియు పురుగు నివారణ చేసుకోవచ్చునని తెలిపారు

ఈ కార్యక్రమంలో సింగనబంద వ్యవసాయ సహాయకులు ఎల్. హరీష్ , బి.రమేష్ మరియు రైతులు పాల్గొన్నారు

**నారా చంద్రబాబు నాయుడు క్షేమంగా ఉండాలని**
**టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి ఆధ్వర్యంలో**

## శ్రీ అభయాంజనేయ స్వామికి పూజలు

భీమునిపట్నం : విజయభాను న్యూస్ టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ కోరాడ రాజబాబు ఆదేశాల మేరకు బుధవారం తిరుపతి సన్నిధి లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు క్షేమంగా ఆయురారోగ్యాలతో బయటికి రావాలని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురిమిన రవణమ్మ, కురిమిన రమణ, మామిడి అచెమ్మ మరియు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు

# సాయిబాబా ఆలయానికి వెండి సామాగ్రి బహుకరణ



విశాఖ రురల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ 6 వ వార్డ్ పరిధి పీఎంపాలెం చివర బస్సు స్టాప్ సమీపంలో గల షిర్డీ సాయి పద్మ సాయి పద్మశాయి ఆలయానికి పి.ఎం.పాలెం కు చెందిన కంటి నాగరాజేష్, సుష్మిత దంపతులు గురువారం వెండి కుందులు, ప్లేట్ లు బాబా వారి సేవకు అందించారు. ఈ కార్యక్రమం లో ఆలయ అభవృద్ధి కమిటీ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, కార్యదర్శి పిన్నింటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో జరగని అభివృద్ధి

# ఇప్పుడు జరుగుతోంది

చెబుతున్నా. 52 నెలల కాలంలో ప్రతి అడుగూ ఇదే విధంగా పడింది. అక్షరాలా రూ.2.38 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి వెళ్తున్నాయి. ఎక్కడా లంచాలు, వివక్ష లేవు. మీ బిడ్డ హయాంలో, మనందరి ప్రభుత్వంలో మంచి చేయగలిగాం అంటే గతానికి ఇప్పటికి పోలిక చూడమని చెబుతున్నా. చేతి వృత్తులు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న ఇటువంటి వారు బతకలేని పరిస్థితిలోకి వస్తే ఈ వ్యవస్థ కుప్పకూలిపోదా?. ఇటువంటి వారి గురించి ఎవరైనా ఆలోచన చేశారా?. చేదోడు, వాహన మిత్ర, ఇలా స్వయం ఉపాధిని ప్రోత్సహించే అనేక పథకాల ద్వారా తోడుగా ఉంటున్నాం. ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఎవరూ ఇబ్బంది పడకుండా వారందరికీ సహాయం అందించే కార్యక్రమం జరుగుతోంది. ప్రతి అడుగులోనూ నానానా అంటూ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ, నా పేద వర్గాలు అంటూ ప్రతి అడుగులోనూ చేయి పట్టుకొని నడిపించే కార్యక్రమం జరుగుతోంది. ప్రతి పేద ఇంట్లో నా అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటున్నాం. అక్కచెల్లెమ్మల పిల్లలకు సొంత మేనమామగా ఉంటూ అడుగులు వేయిస్తున్నాం. అక్కచెల్లెమ్మలు బాగుంటేనే కుటుంబాలు బాగుంటాయని, తోడుగా నిలబడుతూ ఈ నాలుగేళ్లలో అక్కచెల్లెమ్మల కోసం వైయస్సార్ ఆసరా ద్వారా చేయి పట్టుకొని నడిపిస్తూ తోడుగా ఉన్నాం. 78,94,169 మంది అక్కచెల్లెమ్మలకు స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ వారికి అందించిన సాయం రూ.19,178 కోట్లు. ఈ జనవరిలో మరో రూ.6,500 కోట్లు నా అక్కచెల్లెమ్మలకు వైయస్సార్ ఆసరా కింద ఇవ్వనున్నాం. సున్నా వడ్డీ కింద ఆ ఒక్క పథకానికే ఇచ్చినది రూ.4,969 కోట్లు. 45-60 సంవత్సరాల మధ్య ఉన్న నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీకి చెందిన అక్కచెల్లెమ్మలు 26,39,703 మందిని ప్రోత్సహిస్తూ అమూల్, ఐటీసీ, రిలయన్స్, హిందుస్తాన్ యూనిలీవర్ లాంటి సంస్థలను తీసుకురావడమే కాకుండా బ్యాంకులతో అనుసంధానం చేసి తోడుగా ఉన్నాం. చేయూత ద్వారా బటన్ నొక్కి మీ బిడ్డ పంపించిన సొమ్ము రూ.14129 కోట్లు. వచ్చే జనవరిలో వైయస్సార్ చేయూత కింద మరో రూ.5 వేల కోట్లు ఇవ్వనున్నాం. కాపు నేస్తం కింద 3,57,844 మందికి తోడుగా నిలబడ్డాం. రూ.2,028 కోట్లు ఇచ్చాం. ఈబీసీ నేస్తం ద్వారా పేద అక్కచెల్లెమ్మలకు 4.40 లక్షల మందికి 1257 కోట్లు ఇవ్వగలిగాం. మత్స్యకార భరోసా ద్వారా 2,43,394 మందికి స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ 538 కోట్లు ఇవ్వగలిగాం.

వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా 82 వేల చేనేత కుటుంబాలకు ఇప్పటికే ఇచ్చిన సాయం రూ.982 కోట్లు. వాహన మిత్ర ద్వారా 2,75,931 మందికి 1302 కోట్లు బటన్ నొక్కి జమ చేశాం. జగనన్న తోడు ద్వారా 15,87,492 మంది చిరు వ్యాపారులకు రూ.2956 కోట్లు ఇవ్వగలిగాం. ఇప్పుడు చెప్పిన పథకాలన్నీ ఇంతకు ముందు జరిగాయా? ఇవ్వగలిగారా అని ఆలోచన చేయాలి. ఇలా నిజంగానే ఒక ప్రభుత్వం వస్తుంది, ఎక్కడా లంచాలు లేవు, అర్హత ఉంటే చాలు నా ఖాతాలోకి డబ్బు వస్తుందని ఎవరైనా అనుకున్నారా. ఇవన్నీ 52 నెలల పరిపాలనలో గతంలో ఎప్పుడూ జరగని విధంగా ఈరోజు ఇవన్నీ జరుగుతున్నాయి.

## జనసంద్రంగా తిరుమల.. గరుడ సేవకు తరలివచ్చిన లక్షలాదిమంది భక్తులు

దర్శనమిచ్చారు. ఏనుగులు, అశ్వాలు ఠీవీగా ముందు వెళ్తుండగా.. భక్తుల కోలాటాలు, డప్పు వాయిద్యాలు, ఇతర కళా ప్రదర్శనల నడుమ వాహన సేవ కోలాహలంగా సాగింది. భారీగా తరలివచ్చిన భక్తుల గోవిందనామస్మరణతో తిరువీధులు మార్మోగాయి. తితిదే ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి తదితరులు వాహన సేవలో పాల్గొన్నారు. గరుడ సేవకు భారీగా భక్తులు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) భద్రతా పరమైన ఏర్పాట్లు చేసింది. తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించింది.

# చంద్రబాబు జ్యుడిషియల్ రిమాండ్ నవంబర్ 1 వరకు పొడిగింపు

మధ్యంతర బెయిల్ ఇవ్వమని సుప్రీంకోర్టులో తాము మౌఖికంగా మాత్రమే అడిగామని.. చంద్రబాబు ఆరోగ్యం సరిగా లేదు కాబట్టి బెయిల్ పిటిషన్ వెంటనే విచారణ జరపాలని కోరారు. ఈ కేసులో చాలామందికి ఇప్పటికే బెయిల్ వచ్చింది కాబట్టి చంద్రబాబుకు కూడా బెయిల్ ఇవ్వమని కోరారు.

సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున దీనిపై విచారణ చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. చంద్రబాబు వ్యక్తిగత డాక్టర్‌తో ఆయనకు పరీక్షలు చేయించేందుకు మీకేమైన అభ్యంతరం ఉందా అని పొన్నవోలును న్యాయమూర్తి అడిగారు. చంద్రబాబుకు వ్యక్తిగత డాక్టర్‌తో వైద్యపరీక్షలకు సంబంధించి విచారణ చేసేందుకు మధ్యాహ్నానికి వాయిదా వేశారు. అయితే శుక్రవారం సుప్రీం కోర్టులో స్కిల్ డెవలెప్‌మెంట్ కేసు క్వాష్ పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.. కోర్టు తీర్పుపై అందరిలో ఉత్కంఠరేపుతోంది. అయితే కోర్టు శుక్రవారం తీర్పును వెల్లడిస్తుందా.. దసరా సెలవుల తర్వాత నిర్ణయాన్ని వెల్లడిస్తుందా అన్నది కూడా చూడాలి. అయితే అందరి కళ్లు ఇప్పుడు సుప్రీం కోర్టు నిర్ణయంవైపు ఉన్నాయి. టీడీపీ శ్రేణులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

# విద్య వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

విద్యావ్యవస్థలో అనేక మార్పులు తెచ్చి 5 నక్షత్రాల హొటళ్ల మాదిరిగా పాఠశాలలు రూపుదిద్దుకున్నాయన్నారు. ఇంటివద్దకే పింఛను అందించేందుకు నాంధి పలికిన ఘనత సీఎందే నన్నారు. పరిశ్రమలు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 4 పోర్టులు, 9 హార్బర్లు ఏర్పాటు కాబోతున్నాయని, విశాఖలో 15వేల కోట్లతో ఇన్ఫోసిస్, ఫార్మా కంపెనీలు ఏర్పాటు, రామాయపట్నం వద్ద రూ.45వేల కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ వంటివి రాబోతున్నాయని, దీంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనుందని అన్నారు. ఒక మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రాబోతున్న సంగతిని ఆయన గుర్తుచేశారు. పార్వతీపురం శాసనసభ్యులు అలజంగి జోగారావు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి గల తేడాలపై ఆలోచన చేయాలని తెలిపారు. గత 52 మాసాలుగా ఇంటివద్దకే పరిపాలన తీసుకురావడం సుపరిపాలనకు నిదర్శనమని కొనియాడారు. పేద, బడుగు, అట్టడుగు, బలహీన వర్గాలతో పాటు అందరికీ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదని చెప్పారు. ఆర్టికల్ 13,17 లను నిజం చేసి నెహ్రూ ఆలోచనలు, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వై.ఎస్.ఆర్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించి దాదాపు కోటి రూపాయల సంపదను ఇచ్చి ప్రజల అవసరాలను తీరుస్తున్నా ప్రభుత్వం అని తెలిపారు. వచ్చే జనవరి నుండి 3వేల పింఛను వంటి అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదని అన్నారు. వై.ఎస్.ఆర్.కాలనీల పేరుతో గ్రామాలను రూపొందించి, రహదారులు, విద్యుత్, తాగునీరు, కాలువలు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్న సంగతిని వివరించారు. జిల్లాకు విచ్చేసిన చైర్మన్ కు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్ ఘన స్వాగతం పలికారు. ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ పి.కె.ప్రకాష్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో జిల్లా ఉద్యానవన అధికారి గిరిజ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్ గునేష్, మండల అధ్యక్షురాలు శోభారాణి, మండల విద్యాశాఖాధికారి ఎస్. సింహాచలం, ఉపాధ్యాయులు తిరుపతిరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


## శరన్నవరాత్రులలో ఐదవరోజు గాయత్రీ దేవి అవతారయి

సాలూరు విజయభాను న్యూస్ అక్టోబర్ 19 : సాలూరు పట్టణంలో శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శ్రీ పంచముఖేశ్వర స్వామి ఆలయంలో శ్రీశ్రీశ్రీ లలితా దేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఐదవ రోజున గాయత్రీ దేవి అవతారంలో ఈరోజు భక్తులకు దర్శనము ఇచ్చిన శ్రీ లలితాదేవి అమ్మవారు. ఉదయం కదంబ వనవాసంలో పూజా కార్యక్రమంలో చేసిన అనంతరం కుంకుమ పూజ 108 మంది భక్తులతో లలితాదేవి హొమం సాయంకాలం అమ్మవారికి కుంకుమార్చన మరియు చెపోత్సవం మరియు శ్రీకృష్ణసఖీ బృందం వారిచే కోలాటం, తిరువీధి లో రథోత్సవం గాయత్రి దేవి అవతారంలో ఘనంగా నిర్వహించారు. లలిత దేవికి ఉంజల్ సేవ, దీపాలంకరణ సేవ, పవళింపు సేవ, మరియు మహాదాసు శ్యామ నీలాద్రిరావు వారి బృందముచే భక్తి సంగీత కచేరి ఘనంగా నిర్వహించారు. శ్రీ పంచముకేశవ స్వామి ఆలయము ప్రైవేటు ట్రస్టు, మరియు సనాతన ధర్మ పరిషత్తు పౌండర్ శ్రీ వెలవలపల్లి పంచ ముకేశ్వర శర్మ సుబ్బు గురువు, సనాతన ధర్మ పరిషత్ కమిటీ, మరియు లలితా భక్త బృందం వారిచే ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో 5సం, జైలు శిక్ష

■ రూ,2000 జరిమానా, బాధితురాలికి రూ, 50,000 నష్టపరిహారం ■ గౌరవ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఆనంది తీర్పు

■ బాధితులకు నాయ్యం జరిగే లాగా దిశ చట్టం స్పీడ్ ట్రయల్ కి ఉపయోగ పడింది స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ




విశాఖపట్నం క్రైమ్ (విజయభాను న్యూస్) : ఐదు సంవత్సరాల బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పు, నిందితుడికి 05 సంవత్సరల జైల్ శిక్ష, రూ. 2,000 జరిమానా మరియు బాధితురాలికి రూ, 50,000 నష్ట పరిహారం విధించిన న్యాయస్థానం. బాధితులకు నాయ్యం జరిగే లాగా దిశ చట్టం స్పీడ్ ట్రయల్ కి ఉపయోగ పడిందని స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ తెలియజేశారు.గురువారం విశాఖపట్నం గాజువాక పోలీసు స్టేషన్, క్రైమ్ నెంబర్ 98/2018 vide SC no 201/19 U/S 354-B 324 IPC, sec 7 r/w 8 of పోక్సో యాక్ట్ 2012 నందు విచారణ ముగిసిన తర్వాత ముద్దాయి కిసాన్ రాజా (s/o సన్వర్ లాల్ వయస్సు 36 సం,) కు 05 సంవత్సరల జైల్ శిక్ష, రూ,2,000 జరిమానా మరియు బాధితురాలికి 50,000 నష్ట పరిహారం చెల్లించాలని గౌరవ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఆనంది తీర్పు ఇవ్వడం జరిగింది.

మల్కాపురంలో ఉంటున్న బాలిక తండ్రి పిర్యాదు ప్రకారం తమ ఇద్దరు పిల్లలు తరచూ తన పొరుగు ఇంట్లో ఉండే ముద్దాయి కిసాన్ రాజా పిల్లలతో ఆడుకుంటూ ఉండేవారు. ఒకరోజు ఇంట్లో తన కూతురు లేకపోవడం గుర్తించి తన భార్యను అడుగగా, ఆమె పక్క ఇంట్లో ఉండే పిల్లలతో ఆడుకోవడానికి వెళ్ళారు అని చెప్పడంతో, వారి ఇంటికి వెళ్ళి చూడగా, ముద్దాయి కిసాన్ రాజా మంచం మీద తన కూతురిపై పడుకొని అసభ్యంగా ప్రవర్తించడం గమనించి, వెంటనే చుట్టుప్రక్కల వారికి సమాచారం ఇవ్వడంతో ముద్దాయి బాలిక తండ్రితో వాగ్వాదానికి దిగి ఇద్దరు కొట్టుకున్నారు. అనంతరం మల్కాపురం పోలీసు స్టేషన్లో పిర్యాదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో గౌరవ కోర్టు వారు పై సంచలన తీర్పు విధించడం జరిగినది.

పై కేసు నందు కన్విక్షన్ పడుట లో ప్రతిభ కనబరిచిన స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ ని, కేసు ట్రయిల్ జరడంలో పురోగతి చూపించిన నగర పోలీసు అధికారులను, ఇన్విస్టిగేషన్ ఆఫీసర్ నీ నగర పోలీసు కమిషనర్ డా.ఏ. రవి శంకర్, ఐ.పి.ఎస్., అభినం దించడం జరిగింది. కోర్టు ట్రైల్స్ నందు విశేష సేవలు అందించినందుకు గాను అభినంధించి, డి.జి.పి అదేశాలను అనుసరించి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న ప్రయారిటీ కేసుల నందు కోర్టులో ట్రయిల్ కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ఉన్నతాధికారులు ప్రతీ కేసును కన్విక్షన్ పడే వరకూ పూర్తి మోనటరింగ్ చేయాలని, ప్రతీ ఉన్నతాధికారి 5 కేసులు మోనటరింగ్ చేసే విధముగా అదేశాలు ఇచ్చామనీ ,కేసుల విషయం లో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్స్పెక్టర్ల తో మాట్లాడుతూ ఉండాలని, ఎక్కువ కేసులు గల రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ పై నిరంతరం దృష్టి పెట్టాలని తెలిపారు, ప్రతీ నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్య మునుపటి నెలతో పోల్చినప్పుడు పెరుగుదల కనిపించాలని తెలిపారు .

## నవంబర్ 18న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

### ఏజడ్పీ సీఈవో పి. శ్రీరామమూర్తి

విశాఖపట్నం, అక్టోబర్ 19:- నవంబర్ 18వ తేదీన ఉమ్మడి విశాఖపట్టణం జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో పి. శ్రీరామమూర్తి తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకటి నుంచి ఏడో స్థాయి సంఘం సమావేశాలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని వెల్లడించారు. ఈ మేరకు అన్ని శాఖల నుంచి ప్రగతి నివేదికలు కోరుతూ లేఖలు పంపించామని పేర్కొన్నారు. స్థాయీ సంఘ సమావేశాల నిర్వహణకు అన్ని శాఖలు సంసిద్ధంగా ఉండాలని, సకాలంలో ప్రగతి నివేదికలు అందించాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు.

## పూడిమడక తీరంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జలదీక్ష



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి సీనియర్ నాయకులు మేరుగు బాపునాయుడు ఆధ్వర్యంలో వినూత్నంగా చేపట్టిన జలదీక్షలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు , టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు , రాజాన రమేష్ కుమార్ పాల్గొన్నారు . గురువారం మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడక సముద్ర తీరంలో ఆయన టిడిపి నాయకులులతో కలిసి చంద్రబాబు నాయుడు అరెస్ట్ అక్రమమని జలదీక్ష చేపట్టారు . మేము సైతం బాబు తోనే, టిడిపి తోనే రాష్ట్ర భవిష్యత్తు అని సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు . ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టిఎన్ టియుసి ప్రధాన కార్యదర్శి పొన్నమల్ల కొండబాబు , గ్రామ పార్టీ అధ్యక్షులు మేరుగు వెంకటరావు , దూలి రంగనాయకులు , ఉమ్మిడి కొండయ్య , మేరుగు మహేష్ , కాసారపు పోలయ్య , సమ్మెంగి లక్ష్మణరావు , చోడిపల్లి యర్రయతాత, మైలపల్లి మసేను , యజ్జల శ్రీరామ్ , సూరాడ నూకాలు , కొవిరి బంగారయ్య , మెరుగు తాతాజీ ధోని నూకరాజు ఎజ్జల నాగేశ్వరరావు ఎరిపల్లి దేవుడు అధిక సంఖ్యలో నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ గ్లోబల్ యూనివర్శిటీ ఫెయిర్




భీమునిపట్నం : విజయభాను న్యూస్ విద్యారంగంలో యూనివర్సిటీలు ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ గ్లోబల్ యూనివర్శిటీ ఫెయిర్ నిర్వహిస్తే విద్యార్థులకు ఎన్నో విజ్ఞానదాయకమైన ప్రయోజనాలను అందించడంలో ప్రముఖపాత్ర వహిస్తాయనీ. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విశాఖపట్నం ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి. అన్నారు వివిధ దేశాల నుండి ప్రముఖమైన విద్యా సంస్థలు ఒక దగ్గరికి రావడం ద్వారా, యూనివర్సిటీల్లో చదవాలనుకునే విద్యార్థులు రకరకాల విద్యా సంబంధిత విషయాలు, క్యాంపస్ వివరాలు, ఆ ప్రాంత సంస్కృతులను తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని. ఈ ఫెయిర్ వల్ల విద్యార్థులకు ఉన్నత విద్యను ఎంచుకోవడం అనే సమాచారం, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుందనీ. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ గ్లోబల్ యూని వర్శిటీ ఫెయిర్‌ను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉన్నత విద్యకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడానికి విలువైన సమాచారం పొందడానికి ఓక్రిడ్జ్ స్కూల్ సరైన వేదిక అయ్యిందనీ ఆస్ట్రేలియా, యూరప్, కెనడా ఐర్లాండ్ తో పాటు 55 కు పైగా ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలు ఈ ఫెయిర్ లో పాల్గొన్నాయి. విశాఖపట్నం పరిధిలో గల స్కూల్స్ నుండి దాదాపు 525 మంది విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్లోబల్ యూనివర్శిటీ ఫెయిర్ లో పాల్గొన్న విద్యార్థులకు విశ్వవిద్యాలయ ప్రతినిధులతో వ్యక్తిగతంగా చర్చించడానికి అద్భుతమైన వేదికగా ఓక్రిడ్జ్ స్కూల్ ప్రధానపాత్ర పోషించిందవి ప్రవేశాలకు సంబంధించిన విషయాలు మరియు స్కాలర్‌షిప్ అవకాశాల గురించి విలువైన సమాచారాన్ని పొందడంలో ఈ కార్యక్రమం ఎంతో విజయాన్ని సాధించింది. యూనివర్సిటీలో ప్రవేశం కొరకు ఎలాంటి టిప్స్ పాటించాలనే కీలకమైన సలహాలను యూనివర్సిటీ ప్రతినిధుల ద్వారా తెలుసుకున్నారు. యూనివర్సిటీ ఫెయిర్ రెండవ ఎడిషన్‌లో విద్యార్థులకు వారి ఉన్నత విద్యకు సంబంధించిన సమాచారంతో పాటు ప్రపంచస్థాయి అవగాహన, వనరులు గైడ్ లైన్స్ అందించడం పట్ల చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ స్కూల్ డైరెక్టర్ అమిత్ జైన్ మాట్లాడుతూ, "ఓక్రిడ్జ్ స్కూల్ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో నేరుగా నెట్‌వర్కింగ్ చేయడానికి గొప్ప అవకాశం కల్పించడమే కాక, అకడమిక్ ఎక్సలెన్స్ లో సరైన సెలక్షన్ కోసం సహాయం చేస్తుందని అన్నారు.

## ఎమ్మెల్యే గడప గడపకు విశేష స్పందన



పరవాడ : పరవాడ మండలం రావాడ పంచాయతీలో ఎమ్మెల్యే అదీప్ రాజ్ చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కు విశేష స్పందన లభిస్తుంది. గురువారం మూడో రోజు ధర్మారాయుడిపేట, ఇందిరమ్మ కాలనీ,కావలి వారి చేలల్లో గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే పాల్గొన్నారు.ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల లబ్దిని వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా ప్రతి ఇంటకి సియం జగనన్న సంక్షేమాన్ని అందించారని, జగనన్న ముఖ్యమంత్రి కావడం వల్లనే మా జీవితాలు బాగుపడ్డాయని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని,మరలా జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిఇసి సభ్యుడు పైల శ్రీనివాసరావు,జడ్పీటీసి పియస్ రాజు,వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వర్రావు,మండలపార్టీ అధ్యక్షుడు కోన రామారావు,వైసిపి నాయకులు కావలి రాజు, అప్పలరాజు, కావలి వాసు,జమ్ముల అశోక్, పల్లా గోవింద్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన ఈ కార్యక్రమం ను . భీమిలి జి.వి. ఎం.సి 3 వ లో ఉన్న అప్పికొండ వీధి సచివాలయం పరిధిలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిభిరంలో కన్వీనర్ రాంభుక్త.దేవి మాట్లాడుతూజగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సంక్షేమము, అభివృద్ధి రెండు కళ్ళుగా చూస్తూ మీకోసం పనిచేయటమే కాకుండా ఈరోజు ప్రతి కుటుంబంలో వారికి ఏం కావాలని ఆలోచనతో అనునిత్యం ఆలోచిస్తూఉన్నారని అన్నారు.జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సేవలను మీ ఇంటి వద్దకే అందించారని అన్నారు.

అలాగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలను, మంత్రులను, ప్రజాప్రతినిధులను, అధికారులను మీ ఇండ్ల వద్దకే పంపి, మీకు రావలసిన వెల్ఫేర్ స్కీమ్స్, అభివృద్ధి జరిగాయా ఇంకా ఏమైనా కావాలా అన్ని అడిగి తెలుసుకుని వాటిని కూడా చేసే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు.

అంతే కాకుండా ఈ రోజు దేశంలోనే ఎవరూ చేయనటువంటి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు జగన్మోహన్ రెడ్డి చేస్తూ.. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలు నిర్వహించారు వీటితోపాటు కంటి వెలుగు పథకం కింద పరీక్షల నిర్వహించడంతో గాను కంటి అద్దాలు ఇవ్వడం జరిగిందని వివరించారు.

ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ డాక్టర్ కల్యాణి , డాక్టర్ అఖిల, అంగన్వాడి సూపర్వైజర్ ప్రమీల , వార్డ్ స్పెషలాఫీసర్ మూర్తి , ఏ పీ డి సంతోష్ ,వైస్సార్సీపీ సి.ఓ విజయలక్ష్మి, సచివాలయ అడ్మిన్ డి.కృష్ణవేణి, శానిటేషన్ కార్యదర్శి శర్మ, నాయకులు గుండసు మధు నాయుడు, మైలపిల్లి.లక్ష్మణరావు,,ఎర్నింటి.అచ్చిబబు, డింగి .దుర్గ రెడ్డి, బోని.సంజీవరావు , ప్రగడ.చంటి, తదితరులు పాల్గొన్నారు.

## నవరస ఆధ్వర్యంలో ఘనంగా అక్కినేని శతజయంతి ఉత్సవం



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా, నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం వారు, ప్రముఖ రంగస్థలం నటులు, దర్శకులు, ప్రయోక్త, న్యాయ నిర్ణేత, నంది అవార్డు గ్రహీత, శ్రీఎస్. కె. మిశ్రోని ఘనంగా సన్మానించారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో వర్రె నాంచారయ్య సంధానకర్తగా జరిగిన ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ ఎస్. వి. ఆదినారాయణరావు, పొన్నాడ మోహనరావు, బొబ్బా ధవళేశ్వరరావు, చలసాని కృష్ణ ప్రసాద్, మేడా మస్తాన్ రెడ్డి, మళ్ళ సురేంద్ర, డాక్టర్ ఎస్. విజయ్ కుమార్, జి. భీమేశ్వర రావు పాల్గొన్నారు. అక్కినేని నాటకోత్సవాల సంస్థ అధ్యక్షులు పొన్నాడ మోహన్ రావు మాట్లాడుతూ మిశ్రో రంగస్థలానికి ఎనలేని సేవలు చేసారని ఎంతోమంది శిష్యులను ఈ రంగానికి పరిచయం చేసారని అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు లాంటి వారు అటు రంగస్థలంలోనూ, ఇటు చలనచిత్ర చరిత్రలోనూ సువర్ణాక్షరాలతో లిఖించబడిన వారని మిగతా అతిథులు తమ ప్రసంగంలో అక్కినేని గురించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. విశాఖ నగర రంగస్థల కళాకారులు కె.వి.యన్.డి. ప్రసాద్, గౌరీశ్వరావు, మురళి మరియు యస్.కె. మిశ్రో అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నవరస మూర్తి, డాక్టర్ కె.వెంకట్రావుల నిర్వహణలో కార్యక్రమం జరిగింది. రంగస్థల నటీమణులు హేమ, శ్రీమతి మాధవీలత, గిరి, తేజ, శ్రీకాంత్, కృష్ణ మూర్తి తదితరులు నిర్వహణా సహకారం అందించారు. ఈ సందర్భంగా రంగసాయి, నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్టు యన్.యన్.ఆర్. యస్.కె.మిశ్రోకి అభినందనలు తెలియజేశారు.

## సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం




భీమునిపట్నం : విజయభాను న్యూస్ జీ వి ఎం సీ భీమిలి జోన్ రెండవ వార్డ్ సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో ఈనెల 17 నుంచి 19 వరకు ఎన్ ఎం సీ నిబంధనల ప్రకారం బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు నేషనల్ మెడికల్ కమిషన్ న్యూఢిల్లీ వారి అనుమతి ప్రకారం రీజనల్ సెంటర్ ఆంధ్ర వైద్య కళాశాల వారి సౌజన్యంతో ఎన్ ఎంసీ వారిచే నియమింప బడిన అబ్జర్వర్ డాక్టర్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్ నిర్వహించారు. వైద్య విద్య నూతన విధానంలో ఏ విధంగా బోధించాలో ఆ విధానాన్ని ఈ వర్క్ షాప్ లో డైనింగ్ ఇచ్చారు ఈ వర్క్ షాప్ లో 13 మంది రిసోర్స్ పర్సన్ కాలేజీ డీన్ పి వి సుధాకర్ కోఆర్డినేటర్ డాక్టర్ బి ప్రీతి డాక్టర్ జగదీష్ సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ఇది యుద్ధ నేరమే

గాజాలోని ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ జరిపిన దాడి అత్యంత దుర్మార్గం. ఈ ఘటనలో 500 మందికిపైగా మృత్యువాత పడినట్లు వస్తున్న వార్తలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. మృతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నారులు ఉండటం మరింత బాధాకరం. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పర్యటనకు కొన్ని గంటల ముందు ఇజ్రాయిల్ జరిపిన ఈ అమానుష దాడి పాలస్తీనీయుల పట్ల అది ఎంత క్రూరత్వంతో వ్యవహరిస్తోందో తెలియచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండటంతో ఆ దాడి తాము చెయ్యలేదని, తమపై దాడి చేయడానికి హమాస్ చేసిన ప్రయత్నమే మిస్‌ఫైర్ అయిందని ఇజ్రాయిల్ నిస్సిగ్గుగా బుకాయిస్తోంది. పాశ్చాత్య మీడియా కూడా దానినే ప్రచారంలో పెడుతోంది. పన్నెండు రోజులుగా సాగుతున్న ఈ పోరులో మొదటి రోజు మినహాయిస్తే విధ్వంసం సృష్టించిందంతా ఇజ్రాయిలే! దాడికి గురైన ఆస్పత్రిలో ఇజ్రాయిల్ దాడుల్లో సర్వస్వాన్ని కోల్పోయి శరణార్థులుగా మారిన 3 వేల మందికిపైగా పాలస్తీనీయులు, వారికి అదనంగా సాధారణ రోగులు చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిపై దాడి చేయడం ద్వారా ఇజ్రాయిల్ యుద్ధ నేరానికి పాల్పడింది. దీనికి బాధ్యత వహించకుండా హమాస్ మీదకి నెపం నెట్టివేయాలని చూడటం దాని తెంపరితనాన్ని తెలియచేస్తోంది. ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) చెబుతున్న మాటలను, ట్విట్టర్లో పోస్టు చేసిన సాక్ష్యాలు నమ్మశక్యంగా లేవని రష్యా పేర్కొంది. ఇజ్రాయిలే దీనికి పూర్తి బాధ్యత వహించాలని అరబ్ దేశాలన్నీ ముక్త కంఠంతో చెబుతున్నాయి.

మానవాళి పట్ల, ప్రపంచం పట్ల బాధ్యత ఉన్న వారెవ్వరైనా ఈ తరహా హింసాకాండను సమర్థించరు. కానీ, ఇంత దారుణ హింసాకాండ తరువాత కూడా ఇజ్రాయిల్‌ను బైడెన్ వెనకేసుకు రావడంతో అమెరికా దుర్నీతి మరోసారి ప్రపంచానికి వెల్లడైంది. బుధవారం నాడు ఇజ్రాయిల్లో జరిపిన సంఘీభావ పర్యటనలోనూ, ఆ తరువాత చేసిన ట్వీట్లలోనూ బైడెన్ అన్ని విధాల ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించారు. ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో హమాస్‌ను ఆయన పోల్చారు. దీనిని అదునుగా తీసుకున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు యుద్ధోన్మాదంతో మరింతగా రెచ్చిపోయారు. దాడులు తక్షణం ఆపకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ ఇరాన్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఇజ్రాయిల్‌ను మరింత రెచ్చగొట్టడమే బైడెన్ పర్యటన ఉద్దేశ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గాజాపై భూతల దాడులకు రంగం సిద్ధమవుతోందంటూ వస్తున్న వార్తలు ఈ సందర్భంగా గమనార్హం.

ఆస్పత్రిపై జరిగిన దాడి తరువాత ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం పట్ల ప్రపంచ దేశాలు స్పష్టమైన వైఖరిని తీసుకుంటున్నాయి. తక్షణం దాడులను ఆపి, అమాయక ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆ దేశాలు కోరుతున్నాయి. మరోవైపు గాజాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న ప్రజానీకానికి మానవతా పూర్వక సాయానికి కూడా ఇజ్రాయిల్ షరతులు పెడుతుండటం చర్చనీయాంశంగా మారింది. లెబనాన్, జోర్డాన్, లిబియా, ట్యునీషియా, టర్కీ, మొరాకో, ఇరాన్‌లలో బుధవారం పెద్దఎత్తున పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు జరిగాయి. వేలాదిమంది ప్రజానీకం ఈ ప్రదర్శనల్లో భాగస్వాములయ్యారు. జో బైడెన్‌తో ఈజిప్టు, జోర్డాన్, పాలస్తీనా అథారిటీ నేతల భేటీ కూడా ఈ కారణంగానే రద్దు అయింది. మరోవైపు ఇజ్రాయిల్ దాడుల కారణంగా ఇప్పటికే పది లక్షల మందికి పైగా అమాయక ప్రజానీకం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గాజా నుండి సరిహద్దు ప్రాంతానికి తరలివెళ్లారు. ఆ ప్రాంతం మీద కూడా ఇజ్రాయిల్ బాంబులు వేయడం మరీ దారుణం. అంతర్జాతీయ ఒప్పందాలు, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను తుంగలో తొక్కి సొంత గడ్డపైనే కాందిశీకులుగా, శరణార్థులుగా పాలస్తీనీయులను మార్చిన పాపిష్టి చరిత్ర ఇజ్రాయిల్‌ది. ఆక్రమించిన భూ భాగాలను ఖాళీ చేసి 1967కి ముందున్న సరిహద్దులతో తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు చేయడమే ఈ సమస్యకు పరిష్కారం. ఆస్పత్రిపై దాడి సంఘటనతో పరిస్థితి మరింత దిగజారింది. ఇది పెను విపత్తుగా మారకముందే తక్షణం యుద్ధం ఆపేలా ఇజ్రాయిల్‌పై ప్రపంచ దేశాలు ఒత్తిడి తీసుకురావాలి. భారత ప్రభుత్వం కూడా గుడ్డిగా అమెరికాను అనుసరించడం కాకుండా తన వైఖరిని సమీక్షించుకోవాలి. అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విధానానికి స్వస్తి పలికి స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించాలి. పాలస్తీనా విమోచనా పోరాటానికి చిరకాలంగా భారత్ ఇస్తున్న మద్దతును కొనసాగించాలి.

# రూ.180 కోట్లతో విశాఖలో యూనిటీ మాల్ నిర్మాణం

## - రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడి



విశాఖపట్నం(విజయభాను న్యూస్): సుమారు 180 కోట్ల రూపాయలతో విశాఖలోని రామానాయుడు స్టూడియో సమీపంలో ఐదు ఎకరాలలో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యూనిటీ మాల్ ని నిర్మించేందుకు రంగం సిద్ధం చేశామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలియజేశారు. రాంనగర్ విఎమ్ఆర్డిఏ కాంప్లెక్స్ లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆప్కో, లేపాక్షి షోరూమ్ ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిటీమాల్ నిర్మాణానికి కావలసిన భూసేకరణ పూర్తయిందని, ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధంగా ఉందని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళ నైపుణ్యాలను ఈ యూనిటీ మాల్ లో ఏర్పాటు చేయనున్నామని, సరసమైన ధరలకు ప్రజలు వాటిని విక్రయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అదే విధంగా యూనిటీ మాల్కు సమీపంలోనే ఒక కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించనున్నామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్ రూపొందించిన ఈ హైబ్రిడ్ మోడల్ లేపాక్షి, ఆప్కో షోరూమ్ 94వదని ఆయన చెప్పారు. ముఖ్యంగా చేనేత, హస్తకళల కార్మికులను ప్రోత్సహించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి షో రూమ్ లు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో సుమారు 1000 కోట్ల రూపాయల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని చెప్పారు. అలాగే రెండు లక్షల మంది చేతి వృత్తుల పని వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం విస్తృతమైన చర్యలు తీసుకుందని వివరించారు. ఉప్పాడ, మంగళగిరి, కాళహస్తి తదితర ప్రాంతాలకు చెందిన వస్త్రాల విక్రయానికి ప్రభుత్వం నిరంతరం చేయూతని అందిస్తోందని అలాగే ఏటికొప్పాక, కొండపల్లి, లేపాక్షి కళా వస్తువుల విక్రయానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి అమర్నాథ్ చెప్పారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ ఈ షోరూంలో తొలి కొనుగోలు చేశారు.



# మానవాళి హితంగా జీవ శాస్త్ర పరిశోధనలు

## గీతంలో ప్రముఖ శాస్త్రవేత్తల సూచన



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** వివిధ రకాల రుగ్మతలకు మూలాలను శోధించడంతో పాటు మానవాళి శ్రేయస్సును కోరేవిధంగా జీవ శాస్త్ర పరిశోధనలు చేపట్టాలని ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ రాకేష్ మిశ్ర, ప్రొఫెసర్ ఎల్.ఎస్.శశిధర పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ అధ్యాపకులను, పరిశోధకులను, విద్యార్థులను ఉద్దేశించి గురువారం జరిగిన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్ డైరక్టర్ గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ ఎల్.ఎస్.శశిధర మాట్లాడుతూ మానవ పరిణామ క్రమంలో జన్యుపరంగా వచ్చిన మార్పులను ప్రస్తుత ప్రపంచంలో మనిషికి, జంతువులకు , క్రిమికీటకాలకు గల వ్యత్యాసాన్ని ఆయన వివరించారు. జీవశాస్త్ర పరిశోధకులు తమ అధ్యయనాలను ఏవిధంగా చేపట్టాలో సైచించారు. టాటా ఇనిస్టిట్యూట్ ఫర్ జెనిటిక్స్ అండ్ సోసైటీ డైరక్టర్ డాక్టర్ రాకేష్ మిశ్రా మాట్లాడుతూ తమ పరిశోధన కేంద్రం ద్వారా మానవ జన్యువులలో లోపాలను సరిదిద్దడం, పంటల దిగుబడి పెంచేలా పరిశోధనలు జరపడం, వివిధ రకాల రోగాల నివారణకు జన్యపరమైన పరిష్కారం చూపడం చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ వివిధ విభాగాల మధ్య పరస్పర సహకారంతో జరిగే పరిశోధనల ద్వారా శాస్త్ర విజ్ఞానం పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి, వివిధ విభాగాల సీనియర్ ప్రొఫెసర్‌లు తదితరు పాల్గొన్నారు.

# కవి సమయం

## కర్మ ప్రారబ్ధం

ఆరతార మూర్తులకు సైతం
కర్మ ప్రారబ్ధం తప్పదు
సంచిత, పురాకృత కర్మల
ఫలితం తప్పించుకొనుట అసాధ్యం
సుఖదుఃఖముల యందు సమదృష్టి
సర్వజీవ, సర్వమానవ సమానత్వ భావన
శృతి మించిన రాగద్వేషాదులు త్యజించుట
మన జీవన ప్రథమ కర్తవ్యం
సాదభావన, కర్మఫలములు త్యజించుట
తామరాకు పై నీటిబొట్టు జీవనం
ఈశ్వరార్పణ బుద్ధితో కర్మాచరణ
జనుల సేవతో జీవితాన్ని గడపడమే
జనార్ధనుని సేవ అన్నది ఆర్యక్తి

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

షష్ఠిరా. 9.07మూల రా. 7.32 **శుక్రవారం**
వ,రా. 5.58ల 7.31 వ.తె. 4.44ల **20-10-2023**

**మేషం :** ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్ధలు సమసిపోతాయి. వైద్య రంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు పనివారలతో సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి. **వృషభం :** ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకటు కుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. మీ సంతానం కోసం నూతన పథకాలు రూపొందిస్తారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగంలో వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **మిథునం :** ఉపాధ్యా యులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. మానసిక ఆందోళనవల్ల పెద్దల ఆరోగ్యం విషయంలో సంతృప్తి కానరాదు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం క్షేమ దాయకం. **కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలు వాయిదా పడ తాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. **సింహం :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయ మనం పాటిం చండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తా లకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. కట్టడాల అక్రమాల నిర్మాణంలో సమస్యలను ఎదుర్కొంటారు. నోరు అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి. **కన్య :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదు ర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. **తుల :** స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు. **వృశ్చికం :** కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు. **ధనుస్సు :** ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.. **మకరం** :ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. **కుంభం :** గృహంలో నూతన వస్తువులను అమర్చు కోగలుగుతారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. **మీనం :** ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# అక్షింతల పరమార్ధం తెలుసుకుందాం...

## సంకీర్తన



### చంద్రుడికి ప్రీతిపాత్రం

నవగ్రహాల్లో ఒక్కో గ్రహానికి ఒక్కో ధాన్యాన్ని దానవస్తువుగా పేర్కొంటారు. ఆ రకంగా నవగ్రహాలలో చంద్రుడికి ప్రీతి కరమైన దానవస్తువు బియ్యం. జ్యోతిషశాస్త్రం ప్రకారం చంద్రుడు మనస్సుకు అధినాయకుడు. మనిషి మనసు, బుద్ధి, గుణము, తల్లి, వ్యసనము ఇత్యాదులన్నీ చంద్ర కారకాలే అని అన్నారు పెద్దలు. అందుకే మనిషిపై చంద్రుడి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ చంద్రుడికి సంకేతమైన బియ్యం కూడా మనిషి మనస్సుపై ప్రభావం చూపుతుంది. మనోధర్మాన్ని నియంత్రిస్తాయి.

### దీవెన పరమార్థం

శాస్త్రీయంగా చూస్తే, మనిషి దేహం ఓ విద్యుత్ కేంద్రం. విద్యుత్ సరఫరాల్లో హెచ్చుతగ్గులు సాధారణం. ఈ వ్యత్యాసాలు మనిషి మనస్సు మీద, ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపుతాయి. మనుషుల్లో తమో, రజో, సాత్త్వికాలనే త్రిగుణాలకూ కారకము. పెద్దలు వధూవరులపై అక్షతలు చల్లి ఆశీర్వదించే సమయంలో, దేహం లోని విద్యుత్తులో కొంత బాగం ఈ అక్షతలను తాకుతాయి. ఆశీస్సులు ఇచ్చే వాళ్ల నుంచి, పుచ్చుకొనే వాళ్ల కొంత విద్యుత్ బదిలీ అవుతుంది.

ఈ కారణంగా అక్షతల ద్వారా పెద్దలలో ఉండే సాత్విక గుణం పిన్నలకు లభిస్తుందనేది మన నమ్మకం.పెద్దలు, విద్వాంసులు, గురువులు, తల్లి దండ్రులు, అత్తమామలు వివాహ సమయంలో, శుభకార్యాలలో మనకు అక్షతలు వేసి శిరస్సును తాకి ఆశీర్వదించడంలోని ఆంతర్యం, పర మార్థం ఇదే!

### జీవుడికి సంకేతం

మరో సిద్ధాంతం ప్రకారం చూస్తే మనిషి దేహంలో విద్యుత్ కేంద్రాలు ఇరవై నాలుగు ఉంటాయట. వాటిలో ప్రధానమైనది శిరస్సు. ఇది విద్యుదుత్పత్తి కేంద్రమే కాదు. విద్యుత్ ప్రసార కేంద్రం కూడా. తలపై అక్షింతలు వేయడం ద్వారా వాటిలోని విద్యుత్‌ను గ్రహించి దేహానికి ప్రసారం చేస్తుంది శిరస్సు.అది సరే కాని! అక్షతలుగా ఉపయోగించే బియ్యానికి పసుపు కుంకుమలు కలపడం ఎందుకు? ఆయుర్వేదం ప్రకారం, చర్మ సంబంధ రోగాల్ని అడ్డుకునే శక్తి పసుపుకు ఉంది. పసుపు నుంచి తయారయ్యే కుంకుమకూ ఈ శక్తి ఉంది. అక్షతలు వేసే వారికి ఎలాంటి రోగ సమస్యలున్నా, పుచ్చు కొనే వాళ్ళకి అవి సోకకుండా ఈ పసుపు కుంకుమలు నివారిస్తాయట. అంతేకాక పసుపు కుంకుమలు శుభానికి సంకేతాలు కూడా. ఆధ్యాత్మికంగా చెప్పాలంటే జీవుడికి సంకేతం బియ్యం.

### భగవద్గీతలో ప్రస్తావన

అన్నాద్భవన్తి భూతాని అని మూడవ అధ్యాయంలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు. జీవులు అన్నం చేత పుడతారట. ఈ అన్నం తయారీకి మనం ఉపయోగించే ధాన్యం బియ్యం. భగవంతునిపై అక్షతలు వేసి నమస్కరించడం అంటే, జీవుడు ఈ అన్నంలో పుట్టి, తిరిగి ఈ జీవుడిని భగవంతుడిలోకి చేర్చడమే. అక్షతలలో ఇంతటి పరమార్థం గోచరిస్తుంది.తెలుగులో ఈ అక్షతలని తలంబ్రాలు లేదా తలబ్రాలు అని కూడా అంటారు. తలను:తల యందు పోయబడే, ప్రాలు:బియ్యం అని అర్థం.

### ధాన్యలక్ష్మికి ఆహ్వానం

పూర్వం వధువు ధాన్యలక్ష్మిగా చెప్పబడింది. ఈ తలంబ్రాల కార్యక్రమంలో బియ్యానికి ఒక ప్రత్యేకత ఉంది. ఓ వధువా! నీవు మా ఇంటికి వచ్చాక, మన ఇంట ధాన్యం ఇలా కుప్పతెప్పలుగా విరివిగా ఉండి, మన జీవనానికి ఆధారభూతమైన ధాన్యంతో మనం నిత్య సంపదల వాళ్ళమై తులతూగుతూ ఉండాలి అనే భావానికి అనుగుణంగా ఈ తలంబ్రాల కార్యక్రమం సాగుతుంది.

### వివాహకర్మ పరమార్థం

వరుడు, వధువు శిరస్సులపై తలంబ్రాలు పోసుకొనే దానికి ముందు, వరుడు ముందుగా వధువు చేతిని దర్భతో తుడిచి, దోసిలిలో రెండు మార్లుగా బియ్యాన్ని వేసి, ఆ మీదట పాలని కొద్దిగా చల్లి తలంబ్రాలకి సిద్ధం చేస్తాడు. తలంబ్రాలు వేసాక వధువు ఇలా చెయ్యాలని ఒక పద్ధతి చెబుతుంది. ఈ కాలంలో పురోహితులే చేయించి పోయిస్తున్నారు.ఈ కన్య వంశాన్ని తరింపజేయుగాక పుణ్యం వృద్ధి చెందుగాక.

# సీఎం జగన్ అజ్ఞానంతో విద్యా వ్యవస్థ అధ్వాన్నం

## టీచర్లకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం

## 2024లో జనసేన-టీడీపీదే విజయం జనసేన పిఏసి అధ్యక్షుడు నాదెండ్ల




కాకినాడ : ప్రభుత్వ ఉపాధ్యాయలకు జీతాలు సక్రమంగా ఇవ్వలేని వైసిపి ప్రభుత్వం సీఎం జగన్ అర్ధ జ్ఞానంతో వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేయటానికి స్విట్జర్లాండ్ సంస్థతో ఒప్పదం చేసుకోవటం ప్రజాధనం దుర్వినియోగం చేయటానికేనని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటి అధ్యక్షులు నాదెండ్ల మనోహర్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ ఒప్పందం వల్ల విద్యా వ్యవస్థ నాశనం అవుతుంది అంటూ ఉన్నత స్థాయి అధికారులు చెప్పినా సీఎం జగన్ వినిపించుకోవడంలేదని క్విడ్ ప్రోకో కిందకు వస్తుందన్నారు. గురువారం కాకినాడలోని స్థానిక హెలికాన్ టైమ్స్లో మనోహర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, కాకినాడ సిటీ ఇన్చార్జ్ ముత్తా శశిధర్ ఇతర నాయకులతో కలిసి పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ భారతీయ చట్టాలకు అమోద యోగ్యం కాని స్విట్జర్లాండుక్కు చెందిన ఐబి సంస్థతో రాష్ట్రంలో పాఠశాలలో విద్యావిధానానికీ ఒప్పందం చేసుకోవటం వెనుకు చాలా పెద్ద స్కాం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న దాదాపు నలభై వేల పేచిలుకు పాఠశాలలో ఐబి విద్యా విదానానికి వేల కోట్ల రూపాయిలు చెల్లించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవటం క్విడ్ ఫ్రోకో కనిపిస్తుందని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం నాలుగు వేల పాఠశాలలు, భారతదేశం కేవలం రెండు వందల ఎనిమిది పాఠాశాలలకు మాత్రమే ఐబి విద్యా విధానం ఉందని అలాంటి సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నలభై వేలకు పైబడి ఉన్న పాఠశాలలో దాదాపు వెయ్యా ఎనిమిది పాఠశాలలు ఐబితో ఒప్పదం చేసుకోవటం, ఒకొక్క పాఠశాలకు మదమూడు లక్షల రూపాయిలు ఐబి సంస్థకు చెల్లించటానికి ఒప్పదం కుదర్చుకోవటం దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయిలు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటానికే నని సృష్టమతుందన్నారు. న్యాయ, ఆర్ధిక నిపుణులు సైతం ఈ ఒప్పందం మంచిది కాదని చెప్పినా జగన్ గుడ్డి ధరణిలో ఐబితో ఒప్పందాలు చేసుకోవటం వెనుక పెద్ద కుట్రకోణం కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర సిలబస్ పాఠశాలలను, కేంద్ర సిలబస్ (సిబిఎస్సి) మార్చుటానికి కేంద్రం అవకాశం కల్పించినా కేవలం వెయ్యి పాఠశాలలు మాత్రమే సిబిఎస్సి విద్యా విధానంగా మార్చిగల్గిన సీఎం జగన్ ఏ విధంగా వేల కోట్ల రూపాయిలు పరాయిదేశం సంస్థలకు రాష్ట్ర ప్రజల సొమ్ము దారదత్తం చేస్తారని నాదెండ్ల ప్రశ్నించారు. నాడు నేడు అనే కార్యక్రమం పెట్టి కేవలం పాఠశాలలకు రంగులు మాత్రమే వేసిన జగన్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము స్వాహా చేయటానికే ఐబి సంస్థతో ఒప్పంధంగా కనిపిస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అనేక పాఠశాలలు కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ఉన్నాయని వాటిని మెరుగు పర్చకుండా ఇతర దేశాల సంస్థలతో ఒప్పందాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని మనోహర్ డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీతో కలిసి కార్యచరణ రూపొందిస్తామని చెప్పారు. తమ నాయకుడు తెలుగుదేశం పార్టీకి మద్ధతు తెలిపారని, రానున్నరోజుల్లో ఇరు పార్టీలు ఐక్య కార్యచరణతో వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం క్షేత్ర స్థాయిలో పనిచేస్తామన్నారు. దేశంలో మరే పార్టీ చేయలేని విదంగా తమ జనసేన పార్టీ క్రీయాశీలక సభ్యత్వం కల్గిన వారికి ఐదు లక్షల బీమా చెల్లిస్తున్నమని రానున్న రోజుల్లో వైసిపి పార్టీ నిరంకుశత్వ పాలనపై పోరాటం మరింత ఉదృతం చేస్తామన్నారు. అనంతరం గాయపడి క్షతగాత్రులైన మరణించిన వారి కుటుంబాలకు నాదెండ్ల ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సమావేశంలో కాకినాడ పార్టీ నగర అధ్యక్షుడు తోట సుధీర్, నాయకులు పాఠంశెట్టి సూర్యచంద్ర, వరుపుల తమ్మయ్య బాబు, అత్తి సత్యనారాయణ, పితాని బాలకృష్ణ, తుమ్మల బాబు, శెట్టిబత్తుల రాజబాబు, తంగెళ్ల శ్రీనివాస్, పోలసపల్లి సరోజ, సుంకర కృష్ణ వేణి, బట్టు లీల, బండి సుజాత, బోడపాటి మరియ తదితరులు పాల్గొన్నారు


# జగనన్న చేదోడు నాల్గవ విడత

## లబ్ధిదారులు 3,839 లబ్ధి రూ. 383.90 లక్షలు : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్ .పాడేరు, జగననన్న చేదోడు పధకం నాయీ బ్రాహ్మణులకు, రజకులకు, ధర్జీలకు ఎంతోఉపయుక్తమని, వారు ఆర్ధికంగా ఎదగాలన్న ఆకాంక్షతో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న చేదోడు సద్వినియోగం చేసుకుని ఆర్ధికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. గురువారం కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరులో ముఖ్యమంత్రి ప్రారంభించిన నాల్గవ విడత జగనన్న చేయూత కార్యక్రమంలో కలక్టరేట్ సమావేశ మందిరం నుండి కలెక్టర్, బిసి కార్పోరేషన్ అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బిసి సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, వాటి ఫలాలు అర్హులందరూ పొందాలని కోరారు. నాయీ బ్రాహ్మణులు, రజకులు, ధర్జీలకు ప్రతి ఏటా రూ. పది వేలు చొప్పున ఆర్ధిక సహాయం అందించటం గొప్ప విషయమని, ఇప్పటి వరకు నాలుగు విడతలలో రూ 40 వేలు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. జిల్లాలో ఈ ఏడాది నాల్గవ విడత కింద 3,839 మంది లబ్ధిదారులకు పది వేల రూపాయలు చొప్పునరూ. 3,83,90,000లు చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ చేతుల మీదుగా అందచేసారు. నాలుగేళ్ళలో 9,859 మంది లబ్ధిదారులకు రూ. 9,85,90,000లు అందజేయటం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. అరకు నియోజక వర్గంలో 881 మంది, పాడేరు నియోజకవర్గంలో 1126 మంది, రంపచోడవరం నియోజక వర్గంలో 1832 మంది లబ్ధి పొందారని వివరించారు. అందులో నాయీ బ్రాహ్మణులు 202 మంది, రజకులు 301 మంది, ధర్జీలు 3,336 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పోరేషన్ ఎఇఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఉచిత వినికిడి వైద్య శిబిరం



కర్నేన శ్రీనివాసనాయుడు

రాజాం (విజయభాను న్యూస్) : ఈనెల 20 నుంచి 24 వరకూ ఐదురోజులు పాటు రాజాంలో సురక్ష ఆస్పత్రి పక్కన శ్రీకాకుళం రోడ్డులో వీరు స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ వద్ద ఉచిత వినికిడి (చెవి) వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఆడియోలజిస్ట్ అండ్ స్పీచ్ థెరిపిస్ట్ కర్నేన శ్రీనివాసనాయుడు (ఎక్స్ కన్సల్టెంట్, అపోల్ హాస్పిటల్, హైదరాబాద్) తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత వినికిడి మిషన్లు ట్రయల్, రీచార్జబుల్ చెవి మిషన్లు, బ్లూటూత్ చెవి మిషన్లు, చెవిలో కనిపించని మిషన్లు లభించునని, స్పీచ్ థెరిఫీ శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు.

# దోసరిలో జగనన్న ఆరోగ్య శిబిరం



రాజాం(విజయభాను న్యూస్) : మండలంలో దోసరి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీపీ ప్రతినిధి లావేటి రాజగోపాలనాయుడు గురువారం ప్రారంభించారు. ప్రజలు ఈవైద్యశిబిరాన్ని చక్కగా వనియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్శింహులు, స్థానిక సర్పంచ్ తులసినాయుడు, ఎంపీటీసీ సభ్యులు వాసు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, వైద్యులు డాక్టర్ సిద్దీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు రమ్య అకాడమీ చేయూత




కాకినాడ, అక్టోబర్ 19: పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే పేద విద్యార్థులకు రమ్య అకాడమీ ద్వారా ఉత్తమమైన తర్ఫీదు ఇవ్వనున్నట్లు రమ్య అకాడమీ కరస్పాండెంట్ డాక్టర్ పితాని అన్నవరం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏపీఎస్పీ ఎదురుగా ఉన్న పితాని అన్నవరం హాస్పిటల్ ప్రాంగణంలో రమ్య అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు మేధావులు, విద్యాదికులు , సాహితి వేత్తలు హాజరై రమ్య అకాడమీ ఏర్పాటు అశయాన్ని, ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా రమ్య అకాడమీ కరస్పాండెంట్ డాక్టర్ పితాని అన్నవరం మాట్లాడుతూ సమాజంలో పేదల విద్య కోసం గత 20 సంవత్సరాలుగా వివిధ రూపాల్లో సేవలు అందించినట్లు చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి లేక సతమతమవుతున్న నిరుద్యోగులకు తన వంతు సహకారంగా రమ్య అకాడమీ ద్వారా పలు రకాల పోటీ పరీక్షలకు అవసరమయ్యే శిక్షణను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ కె కృష్ణఫర్, నెహెమ్యా, చిందాడ చిన్నోడు తదితరులున్నారు.

# ముగిసిన చిల్డ్రన్స్ మినిస్ట్రీ ఫర్ క్రిస్టీ



రాజాం (విజయభాను న్యూస్) : హెూసన్నా అపోస్తలిక్ మినిస్ట్రీస్ మహాదేవుని యేసయ్య ప్రార్ధన మందిరం నందు రెండు రోజులుగా చిన్నారులకు సందేశాత్మక కార్యక్రమం చిన్న పిల్లలు నుండి యువతీయువకులు వరకు అందరిని అలారించే విధంగా కార్యక్రమం జరిగిందని ప్రొఫెసర్ , పాస్టర్ రత్నకుమార్ అన్నారు. సీఎంఎఫ్సి పేరుతా చిల్డ్రన్స్ మినిస్ట్రీ ఫర్ క్రిస్ట్ పేరుతో డాక్టర్ . హషన్ రాజ్ అండ్ టీమ్ తో రెండవ రోజు నాలుగు వందల మంది పిల్లతో నాటికల ఆట పాటలతో పాటు దైవ ఆధ్యాత్మిక సరదాగా నవ్వింపు కార్యక్రమాలు నేర్పించటం జరిగింది. చూటుపక్కల అనేక క్రైస్తవ మందిరాల నుండి చిన్న పిల్లల మొదలకొని యువతీయువకులు వరకు కార్యక్రమాల్లో అత్యధికంగా పాల్గొన్నారు. పాస్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి దసరా సెలవుల్లో చిన్నపిల్లల మొదలుకొని యవ్వనస్తుల వరకు సమాజంలో విద్యార్థుల దశనుండి ఉద్యోగం చేసే వరకు పిల్లల పట్ల తల్లిదండ్రులు పడే కష్టనష్టాలను పిల్లలకు అవగాహన కలిగిస్తూ తల్లిదండ్రులను గౌరవించే విధానాన్ని నేర్పిస్తూ సమాజంలో యవ్వనస్తులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చక్కనైన మార్గంలో నడవాలని బోధించారు.

వీటితో పాటు బైబిల్ స్టడీస్ పై పోటీలు నిర్వహిస్తూ గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం కూడా చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వచ్చిన పిల్లలందరికీ అల్పాహారంతో పాటు మధ్యలో స్నాక్స్ వాటర్ బాటిల్స్ పాటు విందు భోజనాలు ఏర్పాట్లు చేశారు. మహాదేవుని యేసయ్య మందిరంలో పాస్టర్ రత్నకుమారు తో పాటు హెూసన్నా అపోస్తులిక్ మినిస్ట్రీస్ సంఘ సభ్యులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సంక్షేమం తరహాలోనే వైద్య సేవలు

## పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

## అత్యధికంగా జీకే వీధి మండలం వంచులలో జగనన్న ఆరోగ్య సురక్షలో 1000 టోకెన్ల రిజిస్ట్రేషన్



అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్. పాడేరు. ఇంటింటికి సంక్షేమ పథకాలను ఏ విధంగా అందిస్తున్నామో, వైద్యాన్ని కూడా పల్లె పల్లెకు తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిగారిని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జీకే వీధి మండలం వంచుల సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడకు హాజరైన ప్రజలతో అందుతున్న సేవలు గురించి మాట్లాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూదేశంలో ఎక్కడా లేనివిధంగా పల్లె పల్లెకు వైద్యుల వచ్చి సేవలందిస్తున్నారన్నారు. ఇంతకుముందు ఈ తరహా కార్యక్రమం మనం ఎప్పుడూ చూడలేదన్నారు. గడపగడపకు జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ఏ స్థాయిలో అందిస్తున్నారో అదే స్థాయిలో వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అనారోగ్య సమస్యలు ఉన్న సరే హాస్పటల్ కి వెళ్లి వైద్యం చేయించుకోలేని వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని అటువంటి వారందరికీ కూడా జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ జగనన్న ఆరోగ్య వైద్య శిబిరంలో ఏడు రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తారని మెరుగైన వైద్య చికిత్స కోసం హాస్పిటల్స్ కి రిఫర్ చేసి అక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించడం చికిత్స పొందుతున్న సమయంలో వైయస్సార్ ఆరోగ్య ఆసరా కింద ఆర్థిక సహకారం కూడా ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఎక్కడా లేని విధంగా అత్యధికంగా ఈరోజు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 1000కి పైగా టోకెన్లు రిజిస్ట్రేషన్ జరిగిందని భాగ్యలక్ష్మి చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి ఉచిత భోజన సౌకర్యం కూడా ఐటిడి ఏర్పాటు చేస్తుందన్నారు. ఈరోజు వైద్య శిబిరంలో ఆప్తిమాలజిస్టు, గైనకాలజిస్ట్ మరో ఇద్దరు వైద్య నిపుణులు హాజరయ్యారని వీరి సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం మిగతా పోషకాహార లను క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. పౌష్టికాహారం తీసుకున్నప్పుడే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తద్వారా వ్యాధులు మన దరికి చేరవని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్నవారికి వారం వారం వచ్చి తీసుకునే పరిస్థితి లేని వారికి నెలకు ఒకేసారి సరుకులు ఇచ్చే ఏర్పాట్లు కూడా ప్రభుత్వం చేసిందని అన్నారు. బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా తమ ప్రాంతానికి వచ్చి వైద్య సేవలు అందించేందుకు సుముఖత చూపిన వైద్యులందరికీ కూడా గిరిజన అందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ, వనపలా రాజేష్, స్థానిక ఎంపిటిసి జోరంగి సరస్వతి, ఎస్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ మరియు మండల ప్రెసిడెంట్ బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీపీ బోయిన కుమారి, అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి గెమ్మిలి జోగ్గిరాజు, జె సి ఎస్ మండల కన్వీనర్ పోతురాజు కృష్ణమూర్తి, పిఎసిఎస్ చైర్మన్ వసుపరి



ప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి జోరంగి ప్రసాద్, నాయకులు వంతల అరుణకుమార్, గణపతి, సర్పంచ్ వంశీకృష్ణ , ఎంపీటీసీ పసుపులేటి నాగమణి, నాయకులు మూర్తి, కృష్ణ, సచివాలయ కన్వీనర్ రీమల బుజ్జి, నాయకులు, కార్యకర్తలు డాక్టర్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడాలని దుర్గమ్మకు కోండ్రు పూజలు



రాజాం : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ గురువారం నాడు వంగర మండలం ఎం. ఎస్.ఆర్ పురం, రుషింగి గ్రామంలో దేవి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా ప్రజాక్షేత్రంలోకి వచ్చి,రాష్ట్రానికి పట్టిన గ్రహణం సీఎం జగన్ మోహన్ రెడ్డి పీడ విరుగడ అవ్వాలని,ప్రజలను పీడించే నియంత ప్రభుత్వం అంతం కావాలని అమ్మవారిని కోండ్రు వేడుకున్నారు, అనంతరం కోండ్రు మీడియాతో మాట్లాడుతూ ఈ సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో నాలుగున్నర సంవత్సరాలుగా నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, గ్రామీణ ప్రాంతాలు అయితే పూర్తిగా కుంటు పడ్డాయన్నారు, ఈ నియంత ప్రభుత్వంలో ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు దాడులు భూ ఆక్రమణలు చేయడమే కాకుండా రాక్షసుడిలో సీఎం జగన్మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని కోండ్రు మండిపడ్డారు, ఇలాంటి చీకటి రోజులు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేవని ఎద్దేవా చేశారు, చంద్రబాబు నాయుడు పై అక్రమ స్కిల్ డెవలప్మెంట్ కేసు తో పాటు కక్షపూరితంగా వరుస కేసులు నమోదు చేయించడం సిగ్గుచేటు అన్నారు,సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి ని ఇలాంటి అక్రమకేసులు సీఎం జగన్ మోహన్ రెడ్డి పెట్టించడం యావత్ భారతం ఖండిస్తుందన్నారు.న్యాయస్థానంలో అధినేత చంద్రబాబుని కడిగిన ముత్యంలా తీసుకు వచ్చేందుకు కృషిచేస్తామన్నారు, చంద్రబాబుని ముఖ్యమంత్రి ని చేసేవరకు ప్రతీ ఒక్కరం కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు.

# మైగ్రేన్‌కు చెక్ పెట్టండిలా


మహిళల్లో ఒత్తిడి శాతం పెరిగిపోయి అది క్రమంగా మైగ్రేన్ తలనొప్పిగా తయారయ్యే ప్రమాదం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు. ఇప్పుడు అటువంటి మైగ్రేన్ తలనొప్పికి విరుగుడుగా ఆకుప చ్చని యాపిల్స్ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటిని తింటే మైగ్రేన్ తలనొప్పిని దూరం చేయవచ్చని వైద్యు లు చెబుతున్నారు.చిట్స్ కట్టాలి, ఎల్ఐసీ పాలసీలు కట్టాలి, పిల్లల స్కూలు ఫీజులు కట్టాలి.వీటన్నింటినీ ఆ వచ్చి న డబ్బుతోనే సరిపెట్టాలి. ఇంకా అవకాశం ఉంటే వీటిల్లోనే సేవ్ చేసి భర్త అవసరాలకి సర్ధుబాటు చేయాలి. ఒక పక్క ఇన్ని పనులు ఒంటిచేత్తో చేస్తూనే మరో పక్క తన ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఇంటిల్లిపాది బట్ట లు, అంట్లు తానే చేయాల్సివస్తోంది. మరి ఇన్ని సమస్యలను నెట్టుకొస్తున్న మహిళల్లో ఒత్తిడి శాతం పెరిగి పోయి అది క్రమంగా మైగ్రేన్ తలనొప్పిగా తయారయ్యే ప్రమాదం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు.

నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో ఒత్తిడికి లోనయ్యేది ఎక్కు వగా ఆడవారేనని సర్వేలు చెబుతున్నాయి. మగవారు కేవలం సంపా దించడం వరకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇం ట్లో చిన్నచిన్న విషయాలన్నింటినీ ఆడవారే దగ్గరుండి మరీ చూసు కోవాల్సివస్తోంది. ఉదయం లేచిన దగ్గరనుంచి పాలబిల్లు, కరెంట్ బిల్లు, ఎటిఎంలో డబ్బులు డ్రా చేయడం, అవసరం అనుకుంటే బ్యాంకులకు వెళ్లి గోల్డ్ లోన్ తీసుకురావడం వంటి పనులతో పాటు రొటీన్‌గా తెచ్చే కూరగాయలు, ఇంటి సరుకులు ఇవన్నీ ప్లాన్ చేసుకుని తీసుకురావడంలో మహిళలు ప్రధానపాత్ర వహి స్తున్నారు.

మగవారు కేవలం ఒక పదివేలు లేకపోతే 12 వేలు సింపుల్‌గా తమ భార్యల చేతుల్లో పోసేసి చేతులు దులుపు కుం టున్నారు. మళ్లీ ఆ డబ్బులతోనే చిట్స్ కట్టాలి, ఎల్ఐసీ పాలసీలు కట్టాలి, పిల్లల స్కూలు ఫీజులు కట్టాలి వీటన్నింటినీ ఆ వచ్చిన డబ్బుతోనే సరిపెట్టాలి. ఇంకా అవకాశం ఉంటే వీటిల్లోనే సేవ్ చేసి భర్త అవసరాలకి సర్ధుబాటు చేయాలి. మళ్లీ మధ్యలో డబ్బుకోసం చెయ్యిచాచాల్సివస్తే భర్తలు నీకిచ్చిన డబ్బుకు లెక్కచెప్పమంటూ దబాయిస్తుంటారు. ఒక పక్క ఇన్ని పనులు ఒంటిచేత్తో చేస్తూనే మరో పక్క తన ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఇంటిల్లిపాది బట్ట లు, అంట్లూ తానే చేయాల్సివస్తోంది. మరి ఇన్ని సమస్యలను నె ట్టుకొస్తున్న మహిళల్లో ఒత్తిడి శాతం పెరిగిపోయి అది క్రమంగా మైగ్రేన్ తలనొప్పిగా తయారయ్యే ప్రమాదం లేకపోలేదని వైద్యు లు చెబుతున్నారు.

ఇప్పుడుఅటువంటి మగ్రేన్‌తలనొప్పికి విరుగు డుగా ఆకుపచ్చని యాపిల్స్ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటి ని తింటే మైగ్రేన్ తలనొప్పిని దూరం చేయవచ్చని వైద్యులు చెబు తున్నారు. మైగ్రేన్ ఉన్నవారు తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నపుడు గ్రీన్ యాపిల్ వాసన పీల్చితే ఉపశమనం లభిస్తుంద ని చికాగోలో జరిపిన పరిశోధనలో తేలింది. మైగ్రేన్ వచ్చినప్పు డు టాబ్లెట్‌కు బదులు గ్రీన్ యాపిల్ వాసన పీల్చిచూడండి తేడా మీకే తెలుస్తుందని నిపుణులంటున్నారు.

# సుఖమయ జీవనం



ప్రతిరోజూ కొత్తదనంగా గడపాలని, సంతోషంగా జీవిం చాలని కోరుకోని వారుండరు. కానీ చిన్న చిన్న ఒడిదుడుకులు రాగానే జీవితమంటే విరక్తి తెచ్చుకునే వాళ్లూ ఉన్నారు. నాకెందుకిన్ని కష్టాలు అనుకుంటూ నిరుత్సాహంగా గడుపుతుంటారు. ప్రతి క్షణం ఆనందంగా గడపడమనేది మన దృఢ సంకల్పంపైనే ఆధారపడి ఉంటుంది. ఆచరణలో పెడితే ఆనందంగా జీవించడమనేది చాలా సులభం. అది ఎలానో తెలుసుకుందామా? శారీరకంగా, మానసికంగా తీసుకునే జాగ్రత్తలు ఆనందాన్ని తప్పక ఇస్తాయి. సమస్యల గురించి ఆలోచిద్దామన్నా మనం ఆచరించే పద్ధతులు మనల్ని ఆనందం వైపే నడిపిస్తాయి. దైనందిన జీవితంలో కొన్ని రకాల నిర్ణయాలు పాటించడానికి కాస్తంత కష్టతరంగా ఉన్నా సాధన చేస్తే తప్పకుండా ఫలితం లభిస్తుంది.

**అభిరుచిని అభివృద్ధి పరుచుకుంటూ...**

ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయంలో పూర్తి ఆనందాన్ని పొందుతారు. కానీ దాన్ని అప్పుడప్పుడు మాత్రమే ఆచరణలో పెడు తుంటారు. ఉదాహరణకు పాడటం, డ్యాన్స్ చేయడం అంటే ఇష్టమనుకోండి. వాటిని ఎప్పుడైనా ప్రాక్టీస్ చేయడం కాకుండా ప్రతి రోజూ వాటికోసం ఒక ప్రత్యేకమైన సమ యా న్ని కేటాయించాలి. వాటిని రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా చేసుకుంటే ఎంతో ఉత్సాహం మీ సొంతమవుతుంది.

**తర్జనబర్జనలు లేకుండా....**

పని మొదలు పెడదామనుకున్న సమయానికి అనేక రకాల ఆలోచనలు ఊకుమ్మడిగా దాడిచేస్తుంటాయి. ఆ పని చేద్దా మా వద్దా అంటూనే సమయాన్నంతా వృథా చేసుకుంటారు. ఒక నిర్ణయానికి వచ్చే సరికి ఆ పని చేయడానికి సరిపడినంత సమయం ఉండదు. అలా తర్జన బర్జనలు పడుతూ ఆలోచిం చడాన్ని సమస్యగా స్వీకరిస్తారు చాలామంది. ఏం జరిగినా మన మంచికే జరుగుతుందన్న విషయాన్ని ఆచరణలో పెట్టగలిగితే ఎలాంటి పరిస్థి తుల్లోనూ మితిమీరి టెన్షన్ పడ రు. మనం చేసే పనివల్ల ఫలితం మంచి,చెడు అయినా వాటి నుంచి అనుభవం జ్ఞానం పొందొచ్చు. ఫలితం సక్రమంగా లేకపోతే జీవితంలో వేసే మరోఅడుగులో కాస్తంత ఎక్కువ జాగ్రత్త పాటిస్తాం. కాబట్టి ప్రతి క్షణాన్ని ఓ అనుభంగా తీసుకో గలగాలి. అప్పుడు ఏవీ సమస్యలుగా కనబడవు.

**వర్తమానంలో జాగ్రత్తగా...**

క్షణం క్రితం జరిగిన ఏ విషయం మనకు జ్ఞాపకాలను మి గుల్చుతుందే గాని తిరిగి కోల్పోయిన సమయాన్ని ఇవ్వదు. గ తాన్ని నెమరు వేసుకునే అలవాటు తక్కువగా ఉండాలి. రోజు లో ఎంత సమయాన్ని గడిచిపోయిన విషయాలకోసం వెచ్చి స్తున్నామో పరిశీలించండి. అందులో ఉపయోగపడేవి చాలా తక్కువగానే ఉంటాయి. చేస్తున్న పనిని వదిలిపెట్టి గతంలోకి వెళ్లిపోతే రేపు అనేది శూన్య మవుతుంది. వర్తమానాన్ని ఎంత జాగ్రత్తగా ఉపయోగించుకుంటామో అంత మంచి భవిష్యత్తు మనచేతుల్లో ఉన్నట్టు. మంచినీళ్లు తాగుతున్నా, భోజనం చేస్తున్నా శ్రద్ధగా, ఇష్టంగా చేయాలి.

**టేక్ ఇట్ ఈజీ పాలసీ..**

కొంతమంది కొన్ని విషయాలను వినడానికి ఇష్టపడరు. అలాగే చుట్టూ ఉన్న పరిస్థితులన్నీ కూడా తమకు అనుకూలం గా ఉంటేనే ఇమ డటానికి ఇష్టపడుతుంటారు.

# వాటర్ కూలర్ వాడబోతున్నారా?

ఎండలు బాగా ముదురుతున్నాయి కదా. ఇక చాలాకాలం పాటు వాడకుండా ఎప్పటినుంచో అలా ఓ మూల పడి ఉన్న వాటర్‌కూలర్ తీసి వాడాలనుకుంటున్నారా? దాన్ని అలా తీసేసి, వెంటనే ఇలా వాడేయకండి. నిద్రపోతున్నప్పుడు గదిని చల్లబరిచేందుకు వాడే ఎయిర్‌కూలర్ విషయంలోనూ ఇదే జాగ్రత్త పాటించడం అవసరం. గతేడాదో లేదా చాలాకాలం కిందటో వాటర్‌కూలర్ వాడటం మానేసిన సమయంలో దాని కింది భాగంలో ఎన్నో కొన్ని నీళ్లు ఉన్నాయనుకోండి. అక్కడ లీజియోనెల్లా అనే ఓ ప్రమాదకరమైన బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఉంది. ఆ బ్యాక్టీరియా కారణంగా 'వాటర్ కూలర్ నిమోనియా' అని వాడుక భాషలో పిలిచే ప్రమాదకరమైన నిమోనియా రావచ్చు. అందుకే అట్టడుగున ఎంత మాత్రమూ చెమ్మలేకుండా చేసేందుకు ఓసారి వాటర్‌కూలర్‌ను లోపలి చెమ్మ అంతా ఇగిరిపోయేలా చూడాలి. ఆ తర్వాతే వాటర్ కూలర్‌ను వాడాలి. ఎయిర్ కూలర్ విషయంలోనూ ఇదే జాగ్రత్త పాటించాలి. ఇక ఎయిర్‌కూలర్‌లో అడుగున నీరు ఉంటే ఇదే లీజియోనెల్లా బ్యాక్టీరియా ఇక్కడ కూడా చేరవచ్చు. అందుకే ఇలా ఎయిర్ కూలర్‌ను వాడేముందు ఒకసారి ఆరుబయటకు తీసుకొచ్చి, కాసేపు ఆన్ చేసి, అడుగున ఒక్క చుక్క నీరు కూడా లేకుండా చూడాలి. ఇలా ఆన్ చేయడం వల్ల మరో ప్రయోజనం కూడా ఉంటుంది.




# బాబోయ్ పొగ..!



ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మరణాలలో ఊపిరితిత్తుల క్యాన్సర్ మొదటి వరుసలో ఉంటుంది. ప్రతి ఏటా 1.6 మిలియన్ల మరణాలు దీని వల్లనే సంభవిస్తున్నాయని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఆసియా దేశాల్లో 51 శాతం క్యాన్సర్ మరణాలుండగా వీరిలో 21 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లనే చనిపోతున్నారు. నవంబర్ నెలను ఊపిరితిత్తుల క్యాన్సర్ మాసంగా పరిగణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ గురించి కొన్ని అంశాలు..

సినిమాల్లో హీరోను చూసో, స్నేహితుల ప్రోద్బలంతోనో సిగరెట్లనే ఊబిలో చాలామందే చిక్కుకున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీసే ఈ పొగాకు అలవాటు లేనివాళ్లలో కూడా ఇది కనిపిస్తోంది. పొగతాగే అలవాటు లేకపోయినా వాళు వదిలిన పొగ పీల్చడం వల్ల (ప్యాసివ్ స్మోకింగ్) కూడా చాలామందిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇందుకు రోజురోజుకూ కలుషితమవుతున్న వాతావరణ కాలుష్యమూ కారణమే.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఫ్యామిలీ హిస్టరీ ఏమీ ఉండదు. ఊపిరితిత్తుల క్యాన్సర్ కుటుంబంలో వంశానుగతంగా రాదు. అయితే ఏ క్యాన్సర్‌కైనా జన్యువుల్లో అకస్మాత్తుగా కలిగే మార్పులే (ఉత్పరివర్తనాలు) మూలకారణమవుతాయి. కాని ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు వీటిని గుర్తించలేము.

ఈ మార్పులను సాధారణంగా శరీరం కంట్రోల్ చేస్తుంటుంది. ఇది కంట్రోల్ చేయలేనప్పుడు అది క్యాన్సర్‌కి దారితీస్తుంది. ఈ మార్పులు నిరంతరం మారుతుంటాయి. అందుకే వాటిని గుర్తించడం కూడా సాధ్యపడడం లేదు. ఒక ముఖ్యమైన విషయం ఏంటంటే, ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ రిస్కు ఉంటుంది. ఎందుకంటే అందరిలోనూ ఉత్పరివర్తనాలు ఏర్పడుతాయి. చెడు అలవాట్లుంటే ఈ రిస్కు పెరుగుతుంది.

**బయోమార్కర్లతో వ్యక్తిగత చికిత్స**

ప్రతి కణం మీద కొన్ని రకాల ప్రొటీన్లు ఉంటాయి. ఈ ప్రొటీన్లను బట్టి అది క్యాన్సర్ కణమో కాదో కూడా గుర్తించవచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో కొన్ని రకాల ప్రొటీన్లను గుర్తించారు. వాటిలో ఎపిడెర్మల్ గ్రోత్ ఫ్యాక్టర్ (ఇజిఎఫ్)-రిసెప్టార్, ప్రోగ్రామ్ డెత్ సెల్ లైగంట్ (పిడి-ఎల్ 1), అనఫలాక్టిక్ లింఫోమా కైనేజ్ (అల్క్ ) లాంటివి ముఖ్యమైనవి. వీటినే బయోమార్కర్లుగా పరిగణిస్తారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ అని తేలినవాళ్లకు ఈ బయోమార్కర్ల టెస్టు చేస్తారు. వీటికి పాజిటివ్ వస్తే ఆయా బయోమార్కర్లకు వ్యతిరేకంగా పనిచేసే మందును ఇస్తారు. దీన్ని టార్గెటెడ్ థెరపీగా కూడా అంటారు.

**నిర్ధారణ**

ఏ క్యాన్సర్ విషయంలో అయినా, వ్యాధి నిర్ధారణ, అది ఏ దశలో ఉందో తెలుసుకోవడం, ఆ తరువాత చికిత్స ఇలా మూడు దశలు ఉంటాయి. క్యాన్సర్‌కి ప్రధానంగా చేసే పరీక్ష బయాప్సీ. జన్యుమార్పులు ఉండి, బయోమార్కర్లు పాజిటివ్ వచ్చినవాళ్లకు ఇక వేరే టెస్టులేమీ చేయకుండా టార్గెటెడ్ థెరపీ ఇస్తారు. నెగటివ్ ఉన్నవాళ్లకు కీమోథెరపీ ఇస్తారు.

టార్గెటెడ్ చికిత్స ఏడాది పాటు కొనసాగించిన తరువాత వ్యాధి ఏ స్థితిలో ఉందో తెలుసుకుని, ఒకవేళ పెరిగిందనుకుంటే మళ్లీ బయోమార్కర్ టెస్టు చేయాల్సి ఉంటుంది.

ఎందుకంటే జన్యువుల్లో మార్పులు ఈరోజు లేకపోవచ్చు, మరుసటి రోజు ఉండవచ్చు. కాబట్టి మొదటి నెగటివ్ ఉన్న బయోమార్కర్లకు తరువాత పాజిటివ్ రావొచ్చు.

**ఈ పొగ వదిలేనా?**

వాతావరణ కాలుష్యాన్ని మనం ఏం చేయలేము. వాహనాల పొగ, పరిశ్రమల వ్యర్థాలు, కల్తీలు, రసాయనాల ప్రభావం నుంచి బయటపడడం కూడా వ్యక్తిగతంగా మనకు సాధ్యమయ్యే విషయం కాదు. అయితే పొగతాగే అలవాటున్నవాళ్లు మాత్రం కనీసం దానికైనా దూరంగా ఉండే ప్రయత్నం చేయవచ్చు. పొగమానేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఎన్నో వచ్చాయి. పొగాకుకు బదులుగా చూయింగ్ గమ్‌లు, ఇ-సిగరెట్లు వచ్చాయి. అయితే ఇ- సిగరెట్ల వల్ల మాత్రం క్యాన్సర్ రాకుండా ఆగదు.

బెంజీన్, పారా అమినో బెంజీన్ లాంటి ప్రమాదకర పదార్థాలుంటాయి. నికోటిన్ కన్నా ఈ రసాయనాలే ఎక్కువ హానికరం. నికోటిన్ కేవలం పొగాకుకు అలవాటు పడేలా చేస్తుంది. కాబట్టి పొగతాగడం మానే ప్రయత్న ం చేయడం శ్రేయస్కరం.

**ఈ దగ్గు చేటు!**

-ఏ వైరల్ ఇన్‌ఫెక్షన్‌తోనో వచ్చే ప్రతి దగ్గు క్యాన్సర్ కాదు.

-3 వారాల కన్నా ఎక్కువ రోజులు దగ్గు ఉంటే మాత్రం అది క్యాన్సరే కాకపోయినా టీబీ లాంటి ఇన్‌ఫెక్షన్ అయినా అయివుండే అవకాశం ఉంది.

-అకస్మాత్తుగా ఏ కారణం లేకుండా గొంతు బొంగురు పోతే, దగ్గుతో పాటు రక్తం పడితే వెంటనే డాక్టర్ దగ్గరికి వెళ్లాలి.

-సిగరెట్లు తాగేవాళ్లలో అప్పటి వరకు ఉన్న దగ్గు తీవ్రత పెరిగినా, ఆయాసం ఉన్నా డాక్టర్ దగ్గరికి వెళ్లాలి.


# మొటిమల నివారణకు ఇలా చేయండి..



**టీ**నేజర్లు మొటి మల నివారణ కోసం ఏవేవో క్రీములు వాడుతుం టారు. కానీ మన ఇంట్లో ఉండే వస్తువులతోనే మొటి మలను నివారిం చవ చ్చు. ఆ చిట్కాలేంటో తెలుసు కుందాం. తులసి ఆకు, రసం కొంచెం మెత్త గా కలిపి రాత్రి పడుకో బోయే ముందు ముఖా నికి రాసుకుని ఉదయం గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే మొటిమలు పోతాయి.

అలాగే కొంచెం వేపాకు మెత్తగా నూరి దానికి చందనం పొడి కలిపి మొటిమల మీద పూసి గంట తర్వాత స్నానం చేయండి మొటిమలు తొలగిపోతాయి. రోజ్‌వాటర్‌లో చందనంపొడి పసుపు నీళ్లలో కలిపి పేస్టులా చేసి ముఖానికి రాసి పది నిమిషాల తర్వాత కడిగినా ఫలితం ఉంటుంది. మందులషాపులలో లభించే క్లియరాసిల్ ఆయింట్‌మెంట్ ప్రతిరోజూ రాత్రిపూట రాసుకుని ఉదయం గోరువెచ్చని నీటితో కడగండి. చందనం పొడి, కర్పూరం పొడి నీటిలో కలిపి పేస్టులా చేసి రాత్రిపూట రాసుకుని ఉదయమే కడుక్కుంటే మొటిమలు పోతాయి.

# అమ్మాయిల్లో థైరాయిడ్ సమస్య...



ఇటీవల కాలంలో థైరాయిడ్ సమస్య ఎక్కువగా టీనేజ్ అమ్మాయిల్లో కనిపిస్తోంది. టీనేజ్‌లో ఉండగానే ఈ వ్యాధిని గుర్తించి తగిన పోషకాహారం, వైద్యుడు సూచించిన మందులు వాడినట్లయితే 40-50 సంవత్సరాల మధ్యకాలంలో వచ్చే రుతు సంబంధ వ్యాధుల నుండి రక్షించుకోవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. మానవ శరీరంలోని వినాళ గ్రంధులలో ఈ థైరాయిడ్ ఒక గ్రంథి. మన శరీర వ్యవస్థనంతటినీ మెదడు తన అదుపులో ఉంచుకుంటుంది. ఒక ప్రణాళిక ప్రకారం మెదడు తన దైనందిన కార్యక్రమాలను నిర్వహించేందుకు రెండు అత్యంత కీలకమైన వ్యవస్థలపై ఆధారపడుతుంది. అందులో ఒకటి నాడీ వ్యవస్థ. రెండవది వినాళ గ్రంథి వ్యవస్థ దీనినే ఎండోక్రైన్ వ్యవస్థ అంటారు. ఈ ఎండోక్రైన్ వ్యవస్థలో అతి ముఖ్యమైన గ్రంథి థైరాయిడ్ గ్రంథి. సాధారణంగా థైరాయిడ్ గ్రంథి రెండు గ్రంథుల సముదాయం. అవి థైరాయిడ్ గ్రంథి ఒకటి మరొకటి పేరా థైరాయిడ్ గ్రంథి. థైరాయిడ్ గ్రంథి తైరాక్టిన్, (టి 4), ట్రై అయిడో తైరోనిన్ (టి 3) అనే హార్మోన్లను విడుదల చేస్తుంది. పేరా థైరాయిడ్ గ్రంథి పేరా థైరాయిడ్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. కాల్షియం వినియోగాన్ని నియంత్రిస్తుంది. నేడు థైరాయిడ్ సమస్య ప్రతి ఆరుగురు మహిళల్లో ఒకరికి తప్పక ఉంటోందని సర్వేలు సూచిస్తున్నాయి.

వెనకటికాలంలో పోషకాహార ఫలితంగా ఎక్కువగా థైరా యిడ్ సమస్య ఉండేదికాదు. అయితే ఇటీవలకాలంలో ఈ థైరాయిడ్ గ్రంథి అస్తవ్యస్తంగా మారి ఆడవారు, చిన్న పిల్ల లలో ఎక్కువగా బాధపడటం మనం చూస్తున్నాం.

**వ్యాధికి మూలం** : శరీరంలో వ్యాధినిరోధక వ్యవస్థ మనల ను శరీరంలో రోగాలను వృద్ధిచేసే సూక్ష్మక్రిములనుండి రక్షి స్తుంది. అయితే రోగనిరోధకశక్తి తక్కువగా ఉండే అపరిపక్వ ఆహారాన్ని తీసుకోవడం వలన, విషతుల్యమైన ఆహారం శరీ రంలో పంపించడం వలన మనలో రోగ నిరోధక శక్తి నశించి. అంతర్గత వ్యతిరేకశక్తులు అధికం అయ్యాయి. కలుషితమైన నీరు తాగడం, ఆధునిక ఆహారపు అలవాట్లు, వాయుకాలుష్య వంటి ప్రాకృతిక అసహజాలవలన కూడా థైరాయిడ్ సమస్య లు అధికమవుతున్నాయి.చెట్లు నరికివేత ప్రక్రియతో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి కార్బన్ డైయాక్సైడ్ శాతం వాతావరణంలో పెరిగిపోవడం కూడా ఈ సమస్యకు కారణం. ఇటీవల కాలం లో రోగాలను త్వరితగతిన తగ్గేందుకు కొన్నిరకాలైన మందు ల ప్రభావంతో థైరాయిడ్ సమస్య అధికమవుతోంది. అలాగే కొన్నిరకాలైన ఎలర్జీకలి గించే ఆహారపదార్థాలను తెలియకుం డా తినేయడంతో జలుబు,తుమ్ములు,దగ్గు,ఆస్మా, చర్మంకమి లిపోవడం,జుట్టు రాలి పోవడం, కళ్లుమంటలు, దురద వంటి వ్యాధుల తీవ్రతను తొలిదశలోనే గుర్తించలేకపోవడం.

**మానసిక ఒత్తిడి** : ఆహారపుఅలవాట్లకు తోడుమనం నిత్యం అనేక సమస్యలతో సతమతం అవుతుంటాం. అధిక ఒత్తిడితో అనేకమానసిక రుగ్మతలకుగురవు తున్నాము. థైరాయిడ్ సమ స్యకు ఇది కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ఆర్థిక సమస్య లు, ఇంటి సమస్యలు, బైటి సమస్యలు ఇలా

ఉదయం లేచిన దగ్గరనుంచి రాత్రి పడుకోబోయేదాకా అనేక ఒత్తిళ్లకు గురవు తుంటాము. అయితే నేటి ఆధునిక కాలంలో మగవారి కన్నా ఆడవారిలోనే ఈ ఒత్తిడి శాతం అధికంగా ఉండటం గమనా ర్హం. ప్రతిరోజూఇంటిల్లిపాది చాకిరీచేసుకుంటూ తాను కూడా ఆఫీసుకు వెళ్లి మళ్లీ వచ్చీరాగానే వంటపనులు చేస్తూ ఒక యంత్రంలా పనిచేసుకుంటూపోతున్న ఆడవారిలో మానసిక ఒత్తిడి తీవ్రత అధికంగా ఉండి ఆహారవేళల్లో కూడా నియమ నిబంధనలు పాటించకపోవడంతో థైరాయిడ్ ప్రభావం వారి లో ఎక్కువగా ఉంటోందని తేలింది. **అయోడిన్ లోపంతో** : అయోడిన్ తక్కువగా ఉండే ఆహారపదార్థాలను ఎక్కువగా తినడం వలన శరీరంలో హైపర్ థైరాయిడ్‌ఏర్పడుతుంది. ఇదిఎక్కువగాఅడవి, కొండ ప్రాంతా లలో నివసించేవారిలో అధికంగా కనిపిస్తుంది. వారు తీసుకు నే ఆహారంలో అయోడిన్ శాతం తక్కువగా ఉంటుంది. అలాగే వారు పండించే భూముల్లో కూడా అయోడిన్ శాతం ఎక్కువ వర్షాల వలన భూసారంతో కొట్టుకునిపోవడం వలన కూడా ఈ సమస్య వస్తుంది.

**థైరాయిడ్ లక్షణాలు** : థైరాయిడ్ లోపం ఉన్నవారిలో చేతులు వణకడం, ఎక్కువ వేడిని తట్టుకోలేకపోవడం, అధి కంగా చెమటలు పట్టడం, గొంతు వాపు, శ్వాసపీల్చుకోవడం కష్టంగా మారడం, అధికబరువు, ఆకలి మందగించడం, కొం దరు అధికబరువుఉంటారు.

మరికొందరు అతిగానూ చిక్కిపో తారు. కొందరు పెద్దవారిలో బరువు తగ్గిపోవడం, విరేచనలా లు కలుగుతుంటాయి. ఆహారంరుచిగా ఉండకపోవడం, పల్సు రేటుపెరగడం, మెట్లుఎక్కలేకపోవడం, మాటరాకుండా ఆయా సపడటం, వాంతివచ్చినట్లుండటం, కాళ్లునొప్పులు, కండరా లు బలహీనంగా ఉండటం, అరచేతులు ఎర్రగా మారడం కని పిస్తుంది.

# లలితా త్రిపురసుందరి అవతారంలో రాజశ్యామల



పెందుర్తి (విజయభాను న్యూస్) : విశాఖ శ్రీ శారదాపీఠంలో రాజశ్యాములు అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. రాజశ్యామల అమ్మవారు గురువారం ఐదవ రోజున లలితా త్రిపురసుందరి అవతారంలో దర్శనమిచ్చారు. చెరుకు గెడ చేతపట్టిన అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు అమ్మవారి అలంకరణకు హారతులిచ్చి పూజలు చేసారు. రాజశ్యామల అమ్మవారి నిజరూపానికి విశేష అభిషేకం నిర్వహించారు. దశ హారతులిచ్చి వింజామరలతో ఆరాధించారు. మరోపక్క శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లోక కళ్యాణార్థం చేపట్టిన రాజశ్యామల యాగం కొనసాగుతోంది. రాముని పితృ వాక్య పాలనపై డాక్టర్ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి ప్రవచనం చేసారు. స్వాత్మానందేంద్ర స్వామి చేతులమీదుగా రాజశ్యామలా సమేత చంద్రమౌళీశ్వరులను, పీక సంప్రదాయంలో భాగంగా గురువులను ఆరాధిస్తూ దేవతార్చన జరిగింది.



### రాజశ్యామల ఆలయంలోకి అర్చామూర్తి ప్రవేశం

విశాఖ శ్రీ శారదాపీఠంలో కొలువుదీరిన శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో పూజలందుకోవడానికి అర్చామూర్తిని ప్రవేశింపజేసారు. శాస్త్రానుసారం, వేదోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చామూర్తి ప్రవేశాన్ని పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వయంగా పర్యవేక్షించారు. ప్రతిష్టాపనాచార్యుల ఆధ్వర్యంలో అర్చామూర్తి ప్రవేశం జరిగింది. అనంతరం విజయ గణపతి విగ్రహానికి విశేష హారతులిచ్చారు. రాజశ్యామల అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో దీనికి హాజరయ్యారు.



### నేడు(శుక్రవారం) సామూహిక అక్షరాభ్యాసములు

విశాఖ శ్రీ శారదాపీఠంలో మూలా నక్షత్రం సందర్భంగా విశేష కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శారదాదేవి స్వరూపంగా పీఠంలో పూజలందుకుంటున్న రాజశ్యామల అమ్మవారిని మూలా నక్షత్రం రోజున ప్రత్యేకంగా ఆరాధిస్తారు. సరస్వతీ పూజలు, సామూహిక అక్షరాభ్యాసములు పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేసారు, తెలుగు రాష్ట్రాల్లో బాసర, అయినవిల్లి తర్వాత విశాఖ శ్రీ శారదాపీఠంలోనే అక్షరాభ్యాసములు చేయించుకోవడానికి భక్తులు ఆసక్తి చూపిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పీఠం పర్దాలు భారీ ఏర్పాట్లు చేసాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా ప్రణాళిక రచించారు. శారదా దేవి కృపా కటాక్షముల కోసం తల్లిదండ్రులు తమ పిల్లలతో వచ్చి పూజల్లో పాల్గొనాలని, పిల్లలకు సరస్వతీ దేవి పూజలో ఉంచిన పుస్తకాలు, పెన్నులను ఉచితంగా అందిస్తామని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి పిలుపునిచ్చారు.

# పరిశుభ్ర క్యాంపస్‌గా ఏయూ

**– విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం**




ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : పరిశుభ్ర క్యాంపస్‌గా ఏయూను తీర్చిదిద్దాలని, దీనిలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఏయూ విద్య విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు అన్నారు. గురువారం ఉదయం ఏయూ విద్య విభాగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ స్వచ్ఛతాహిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు స్వయంగా శుభ్రం చేశారు. వ్యర్థాల రహితంగా దేశాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీనిని ఏయూలో సైతం అమలు చేస్తున్నామన్నారు. వర్సిటీని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజ కుమారి, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 22 వరకు జిల్లాలో దేవులపల్లి అమర్ పర్యటన



విశాఖపట్టణం, (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ పర్యటన ఉమ్మడి జిల్లాలో నాలుగు రోజుల పాటు జరగనుంది. గురువారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు జరిగే పర్యటనలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ క్రమంలో ఆయన గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకున్నారు. ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖ, ఉప సంచాలకులు, వి. మణిరామ్, ఇతర అధికారులు విశాఖ ఎయిర్ పోర్టులో పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. తొలి రోజు పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంబంధిత శాఖల అధికారులతో సమావేశం అవుతారు. స్థానిక సర్క్యూట్ హౌసులో రాత్రికి బస చేస్తారు. రెండో రోజు అరకు చేరుకొని అక్కడ పర్యటన, కార్యక్రమాల అనంతరం మూడో రోజు అయిన 21న విశాఖ చేరుకుంటారు. 22వ తేదీ ఉదయం సింహాచలంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని, పూర్ణా మార్కెట్ సమీపంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం విమాన మార్గం ద్వారా ఆయన హైదరాబాద్ చేరుకుంటారు.

# పేదలకు అండగా ప్రభుత్వం

**జిల్లాలో 13,332 మంది లబ్దిదారులకు రూ.13.33 కోట్లు జగనన్న చేదోడు జమ**

**– జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పేదలకు అండగా ప్రభుత్వం పనిచేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. గురువారం ఉదయం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు బహిరంగ సభ నుంచి వరుసగా నాలుగో ఏడాది జగనన్న చేదోడు పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 3,25,020 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు రూ. 325.02 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జను చేసే కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వైఎస్. జగన్ మోహన్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. విశాఖ జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన జగనన్న చేదోడు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పథకాలు అందిస్తోందని, వీటి వల్ల చాలా మందికి ప్రయోజనం కలుగుతోందన్నారు. జగనన్న చేదోడు పథకం క్రింద జిల్లాలో 5,942 మంది రజక లబ్ధిదారులు, 1,521 మంది నాయిబ్రాహ్మణులు, 5,862 మంది దర్జీ లబ్ధిదారులకు మొత్తం రూ. 13.33 కోట్ల రూపాయలు లబ్ది చేకూరిందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులై ఉండి మిగిలిపోయిన వారు ఉంటే సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకున్నట్లయితే వారికి వచ్చే ద్వైవార్షిక కార్యక్రమంలో మంజూరు చేయటం జరుగుతుందన్నారు . శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేసి పథకాలను పారదర్శకంగా అమలు చెస్తున్నట్లు వివరించారు. దక్షిణ నియోజకవర్గం కొబ్బరి తోటకు చెందిన రజక లబ్దిదారులు రాలి రవణమ్మ మాట్లాడుతూ రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ల జీవితాల్లో మార్పు రావాలని, వారు మిగతా ప్రపంచంతో పోటీపడి ఎదగాలని వారికి చేదోడునిస్తూ వారికి అండగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని, నవరత్నాల ద్వారా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించే ఘనత గౌరవ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి గారికే దక్కిదాన్నారు. ఉత్తర నియోజకవర్గం బర్మా క్యాంపు ప్రాంతానికి చెందిన సమ్మిని కనకమహాలక్ష్మి మట్లాడుతూ సంవత్సరానికి రూ.10 వేలు చొప్పున గత మూడు సంవత్సరాల నుండి జగనన్న చేదోడు పథకం ద్వారా నగదు అందుకోవడం జరుగుతుందని తద్వారా తమ వృత్తుల అభివృద్ధికి చాలా దోహదపడ్డాయాన్నారు. చేదోడు డబ్బులతో తాము నిర్వహిస్తున్న షాపులకు కొంత మదుపు పెట్టి వ్యాపారం అభివృద్ధికి సహకారం లభించిందన్నారు. ప్రతి ఒక్కరి అభ్యున్నతే తన లక్ష్యంగా నిరంతరం పలు పథకాలు అందించే ఇటువంటి ముఖ్య మంత్రి తమకు కావలని వారి అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజాప్రతినిధులతో కలిసి నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, నెడ్క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ యువశ్రీ, నాయి బ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ వి.నూకరాజు, బిసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్, రజక, నాయి బ్రాహ్మణ, దర్జీ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.





# బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం



పుణె: వన్డే ప్రపంచ కప్‌లో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఇప్పటికే హ్యాట్రిక్ విజయాలను అందుకున్న టీమ్ఇండియా.. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ గెలు పొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (103లిబీ 97 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) 'శత'క్కొట్టడంతో ఈ లక్ష్యాన్ని భారత్ 41.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కోహ్లీ సిక్స్ బాది సెంచరీ పూర్తి చేసుకోవడంతోపాటు భారత్‌కు భారీ విజయాన్ని అందించాడు. శుభ్‌మన్ గిల్ (53బీ 55 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకంతో అలరించగా.. రోహిత్ శర్మ (48బీ 40 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (19బీ 25 బంతుల్లో 2 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కేఎల్ రాహుల్ (34లిబీ 34 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. బంగ్లా బ్యాటర్లలో ఓపెనర్లు తాంజిద్ హసన్ (51బీ 43 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), లిట్టన్ దాస్ (66బీ 82 బంతుల్లో 7 ఫోర్లు) రాణించారు. తర్వాత వచ్చిన నజ్ముల్ శాంటో (8), మెహదీ హసన్ మిరాజ్ (3) సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా.. తౌహిద్ హృదోయ్ (16), నసుమ్ అహ్మద్ (14) పరుగులు చేశారు. ముష్ఫికర్ రహీమ్ (38బీ 46 బంతుల్లో) ఫర్వాలేదనిపించాడు. చివర్లో మహ్మదుల్లా (46బీ 36 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 2, మహ్మద్ సిరాజ్ 2, జస్‌ప్రీత్ బుమ్రా 2, శార్దూల్ ఠాకూర్, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# అర్హులైన వారికి ఇళ్లస్థలాలు

**పాత్రికేయుల పట్ల సీఎం జగన్ సానుకూలంగా ఉన్నారు**

**ఎపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు**



శ్రీకాకుళం, (విజయభాను న్యూస్) : జర్నలిజాన్నే వృత్తిగా చేసుకొని, నిబద్ధతతో పని చేస్తున్న జర్నలిస్టులకు అన్ని విధాలా ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగు వేస్తోందని ఎపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్అండ్‌బీ అతిథి గహంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు ఆధ్వర్యంలో జర్నలిస్టుల బందం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకొని దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ పాత్రికేయ వత్తిలో చిత్తశుద్ధితో పని చేస్తున్న అనేక మంది పాత్రికేయులు కడు పేదరికాన్ని, దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, అటువంటి వారందరికీ సొంతింటి కల నేరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అర్హులై ఉండి, గతంలో ఎన్నడూ ఇంటి స్థలంగానీ, ఇళ్లగానీ పొందనటువంటి నిరుపేదలైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని వివరించారు. రాజకీయ పార్టీలకు కొమ్ము కాసేలా వార్తలు రాయకుండా విలువలతో కూడిన జర్నలిజం చేస్తున్న వారికి ఎల్లప్పుడూ సమాజంలో సముచితమైన గుర్తింపు, గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. ప్రయివేటు పాఠశాలలో పాత్రికేయ కుటుంబ సభ్యులకు శతశాతం ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరగా, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అగ్రతాంబూలం ఇస్తోందని, జర్నలిస్టుల పిల్లలకు కూడా ఉచిత విద్య అందించే అంశం పరిశీలనలో ఉందన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com